


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 255 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు బుధవారం 20 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :255 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE WED 20 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur







## మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌లా వ్యవహరిస్తా

- మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్లా వ్యవహరిస్తానన్న సీఎం చంద్రబాబు
- వేట నిషేధ సమయంలో 1.30 లక్షల కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సాయం
- మత్స్యకార మహిళల కోసం సీవీడ్ సాగు, 60% సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- మన జలాల్లో గస్తీ పెంచి ఇతర రాష్ట్రాల బోట్లను అడ్డుకుంటామని హామీ
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, తీర గ్రామాలకు మెటల్ రోడ్ల ప్రకటన

- మిగతా 7లో



## ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం

- నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేశామన్న సత్యకుమార్
- 785 ప్రైవేట్ ఆసుపత్రులకు నిధులు అందాయని విడుదల
- ఇప్పటి వరకు మొత్తం రూ. 5,556 కోట్లు విడుదల చేశామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవల బలోపేతం దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం ప్రభుత్వం రూ. 919.13 కోట్లను విడుదల చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో భాగంగా ఈ నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆయన వివరించారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా

- మిగతా 7లో




## మోదీ తీరుపై నార్వే జర్నలిస్టు అసంతృప్తి...

### ఘాటుగా సమాధానం ఇచ్చిన విదేశాంగ శాఖ అధికారి



- ప్రధాని మోదీ నార్వే పర్యటనలో చెలరేగిన వివాదం
- ప్రశ్నలు పట్టించుకోకుండా వెళ్లారంటూ మోదీపై జర్నలిస్ట్ విమర్శ
- విదేశాంగ శాఖ బ్రీఫింగ్‌లో భారత ప్రజాస్వామ్యంపై జర్నలిస్ట్ ప్రశ్నలు
- 'కోర్టుకు వెళ్లండి' అంటూ ఘాటుగా బదులిచ్చిన భారత అధికారి
- సోషల్ మీడియాలో వైరల్ అయిన దౌత్యాధికారి సమాధానం

- మిగతా 7లో

## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు




- వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్న షర్మిల
- బటన్లు నొక్కినంత మాత్రాన మళ్లీ సీఎంలు కాలేరని ఎద్దేవా
- వైఎస్సార్ ఆశయాలను నాశనం చేశారని మండిపాటు

- మిగతా 7లో

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

- సెప్టెంబర్‌లో రానున్న రష్యా అధ్యక్షుడు
- ధృవీకరించిన రష్యా అధ్యక్ష భవనం
- బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనున్న పుతిన్
- ఏడాది వ్యవధిలో రెండోసారి భారత్‌కు

- మిగతా 7లో



## ఎడిటర్ వ్యూ

# విజయ్ సర్కార్ కూలుతుందా... చరిత్ర ఏమి చెబుతోంది ?

తమిళనాడులో ఒక సినీ నటుడు అధికారం అందుకున్నారు. రెండు ప్రధానమైన ద్రవిడ పార్టీలను కాదని మరీ ప్రజలు దళపతి విజయ్ నాయకత్వంలోని టీవీకేకి పట్టం కట్టారు. ఆయన పార్టీని అతి పెద్ద పార్టీగా 108 సీట్లతో ముందు నిలబెట్టారు. తమకు కొత్త నేత కావాలని భావించి విజయ్ కి పగ్గాలు అందించారు. ఇక విజయ్ చూస్తే సినీ అనుభవం తప్ప రాజకీయ అనుభవం పెద్దగా లేదు. అంతే కాదు ఆయనకు రాజకీయ నేపథ్యం ఉన్న దగ్గర వారూ లేరు. ఆయన ఎమ్మెల్యే కూడా ఏనాడూ కాలేదు. ఎకాఎకీన ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కేశారు. తమిళనాడు వంటి అత్యంత చైతన్యవంతమైన గడ్డ మీద విజయ్ ముఖ్యమంత్రిత్వం కత్తి మీద సాము అనే చెప్పాలి. రెండు ద్రవిడ పార్టీల అస్థిత్వం కూడా ఆయనకు మరో సవాల్ గా ఉంటుంది.

**ఎంజీఆర్ ప్రభుత్వం బర్తరఫ్ :**

తమిళనాడు చరిత్రలో అత్యంత ప్రజాదరణ కలిగిన ఎంజీఆర్ ప్రభుత్వం 1977లో అధికారంలోకి వచ్చింది. డీఎంకే నుంచి బయటకు వచ్చి ఎంజీఆర్ పార్టీ పెట్టి మరీ అఖండ విజయం సొంతం చేసుకున్నారు. కానీ మూడేళ్ళు తిరగకుండానే ఆయన ప్రభుత్వాన్ని ఆనాటి ఇందిరా గాంధీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేసింది. 1980 ఫిబ్రవరి 17న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను ఉపయోగించి రాష్ట్ర శాసనసభను రద్దు చేయడంతో తమిళనాడులోని ఎం.జి. రామచంద్రన్ ప్రభుత్వం కుప్ప కూలింది. 1980 లోక్‌సభ ఎన్నికలలో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కేంద్రంలో విజయం సాధించింది. అలాగే తమిళనాడులో డీఎంకేతో పొత్తు పెట్టుకుని 20 ఎంపీ సీట్లు గెలిచింది. డీఎంకేకి 16 దక్కాయి. ఒక ఇండిపెండెంట్ గెలిచారు ఆ లోక్ సభ ఎన్నికల్లో అన్నా డీఎంకేకి 2 సీట్లు మాత్రమే దక్కాయి. దాంతో ఏఐఏడీఎంకే ప్రజాభిమానం కోల్పోయిందని కాంగ్రెస్ ఎంజీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది. అయితే ఆ తరువాత అదే ఏడాది జూన్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ఏఐఏడీఎంకే భారీ మెజారిటీతో ఎంజీఆర్ నాయకత్వంలో తిరిగి అన్నా డీఎంకే అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ నిర్ణయం తప్పు అని నిరూపించింది. అలా 1987లో ఎంజీఆర్ మరణించే వరకు అధికారంలోనే కొనసాగారు.

**కరుణానిధి సైతం :**

ఇక 1989లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 150కి పైగా సీట్లు డీఎంకే సాధించింది. అలా కరుణానిధి మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన అప్పట్లో నేషనల్ కేంద్రంలోని కాంగ్రెసేతర పక్షాల కూటమిలో ఉన్నారు. అయితే 1991 జనవరి 30న కరుణానిధి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు. కాంగ్రెస్ మద్దతుతో ఏర్పడిన ప్రధానమంత్రి చంద్రశేఖర్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలా కరుణానిధి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించడానికి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను ఉపయోగించింది. కరుణానిధి నేతృత్వంలోని ప్రభుత్వానికి లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం మధ్య సంబంధాలు ఉన్నాయన్న తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ఆయన ప్రభుత్వాన్ని రద్దు చేశారు. ఆ తరువాత జయలలిత నాయకత్వంలోని అన్నా డీఎంకే 1991 జూన్ 24న ఏర్పడింది. అన్నా డీఎంకే-కాంగ్రెస్ కూటమికి జయలలిత నాయకత్వం వహించి భారీ విజయం సాధించారు. అన్నాఎంకే-కాంగ్రెస్ కూటమి 234 స్థానాలకు గానూ 225 స్థానాలను గెలుచుకుని చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. డీఎంకే కేవలం 2 స్థానాలకే పరిమితమైంది. అలా ఆమె తమిళనాడుకు తొలి ముఖ్యమంత్రి అయ్యారు. తో తమిళనాడు ముఖ్యమంత్రి అయ్యారు.

**ఎన్టీఆర్ విషయంలోనూ :**

ఇక ఉమ్మడి ఏపీలోనూ 1983లో 200 సీట్లు సాధించి టీడీపీ అధినేత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. 1984లో ఆయన ప్రభుత్వాన్ని కాంగ్రెస్ బర్తరఫ్ చేసింది. కానీ నెల తిరగకుండానే రామారావుకు అధికారం అప్పగించి భారీ మూల్యం చెల్లించుకుంది 2013లో ఆప్ ఢిల్లీలో అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడితే 13 నెలలకే ఎన్నికలకు తిరిగి వెళ్ళిన కేజ్రీవాల్ మొత్తం 70 సీట్లు ఉన్న అసెంబ్లీలో 67 సాధించి బంపర్ విక్టరీ కొట్టి అయిదేళ్ళూ కొనసాగారు.

**విజయ్ ని దెబ్బ తీస్తే :**

ఇక తమిళనాడులో విజయ్ మీద జనాలకు ఎంతో అభిమానం ఉంది కాబట్టే అన్ని సీట్లు ఇచ్చారు. ఆయన పాలనను అయిదేళ్ళూ కొనసాగనీయాలి. అలా కాదూ అని ఆరు నెలలలో కుప్ప కూల్చే ప్రయత్నాలు ఎవరు చేసినా భారీ మూల్యం చెల్లించుకుంటారు అన్నది చరిత్ర చెబుతున్న సత్యం. 2031లో టీవీకే పాలన మీద ప్రజలే తీర్పు చెబుతారు. అంత వరకూ ఆగకపోతే మాత్రం ఎంజీఆర్ ఎన్టీఆర్ కరుణానిధిల మాదిరిగా విజయ్ కి కూడా మరింత శక్తిని ఇచ్చి ఆయనను ప్రత్యర్ధులే బలోపేతం చేస్తారు అన్నది ఫ్లాష్ బ్యాక్ చెబుతోంది.

# "బాదంపప్పు" బాగోతం..?

**తాడేపల్లిగూడెం పట్టణంలో ఒక పేరు ఇప్పుడు భయానికి ప్రతీకగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసుల పేరుతో బెదిరింపులు, సెటిల్మెంట్లు, మామూళ్ల వసూళ్లు, ఫోన్ ట్రాప్ వ్యవహారాలు, గంజాయి కేసుల దందా, రేషన్ బియ్యం అక్రమ సెటిల్మెంట్లు, రాజకీయ అండ కోసం రహస్య భేటీలు అంటూ "బాదంపప్పు"పై వస్తున్న ఆరోపణలు స్థానికంగా సంచలనం రేపుతున్నాయి. బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తుండటంతో ఇప్పుడు ఈ వ్యవహారం తాడేపల్లిగూడెంలో క్రైమ్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది.**

**ఎడిటర్, పెన్ పవర్,**
**భీమవరం/తాడేపల్లిగూడెం, మే 19:**




రాత్రి ఒంటి గంట...
తాడేపల్లిగూడెం పట్టణం నిద్రలో ఉంది...
రోడ్లపై అప్పుడప్పుడు కనిపించే వాహనాల లైట్లు తప్ప ఇంకేమీ కదలడం లేదు...
పోలీస్ జీప్ సైరన్ కూడా వినిపించని సమయం...
కానీ...
కొన్ని ఫోన్లు మాత్రం ఆగడం లేదు...
"సార్ మాట్లాడాలి..."
"కేసు పెద్దది అవుతుంది..."
"సెటిల్ చేసుకోండి..."
ఇలాంటి మాటలు విన్న చాలామంది ఇప్పుడు పెన్ పవర్‌ను ఆశ్రయిస్తూ ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.
వారి వాదన ఒక్కటే---
"బాదంపప్పు" పేరు వినగానే భయం మొదలయ్యేది..."
కేసుల పేరుతో కోట్ల ఆట..?
ఒక ప్రభుత్వ ఉద్యోగి...
సాధారణ జీవితం...
కుటుంబం...
ఉద్యోగం...
ఒక రోజు అకస్మాత్తుగా వచ్చిన ఫోన్ కాల్‌తో అంతా మారిపోయిందట.
"మీపై కేసు నమోదవుతుంది..."

**అంతే...**

ఆ తర్వాత మధ్యవర్తుల ఎంట్రీ మొదలయ్యేదట.
రహస్య సమావేశాలు...

**సెటిల్మెంట్ చర్చలు...**

చివరికి లక్షల్లో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి.
బాధితులు చెబుతున్న ప్రకారం...
కేసు భయం చూపించి డబ్బులు వసూలు చేయడం ఒక వ్యవస్థగా మారిపోయిందట.

**గంజాయి కేసులు - ఆదాయ మార్గమా..?**

స్థానికంగా గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థే...
అదే వ్యవహారాన్ని ఆదాయ వనరుగా మార్చుకుందంటూ తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.
కొంతమందిని వదిలేయడం...
మరికొందరిని టార్గెట్ చేయడం...
"పట్టుకుంటాం..."
"లోపల వేస్తాం..."
అంటూ భారీగా డబ్బులు గుంజుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.
చట్టం పేరు చెప్పి...
భయాన్ని ఆయుధంగా మార్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మెడికల్ మాఫియా -- నెలవారీ మామూళ్ల వ్యవస్థ..?**

మెడికల్ వ్యాపారులు కూడా ఈ వలలో చిక్కుకున్నారన్న సమాచారం బయటకు వస్తోంది.
డబ్బులు ఇవ్వని వారిపై-
కేసులు
తనిఖీలు
లైసెన్స్ సమస్యలు
అంటూ ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
కొంతమంది వ్యాపారులు నెలనెలా "మామూల్" ఇవ్వాల్సి వచ్చిందని బాధితులు చెబుతున్నారు.
ఫోన్ ట్రాప్ -- భయంతో సెటిల్మెంట్లా..?
ఈ కథలో అత్యంత భయానక కోణం ఇదేనని స్థానికులు చెబుతున్నారు.

**ఒక వ్యక్తిని టార్గెట్ చేస్తే...**

అతని ఫోన్ డేటా...
కాల్ వివరాలు...
కాంటాక్ట్స్...
అన్నీ సేకరించి...
"నీ పేరు కూడా కేసులో వస్తుంది..."
అంటూ భయపెట్టేవారట.

**కేసుల కంటే...**

ఆ భయమే చాలామందిని సెటిల్మెంట్ టేబుల్ దగ్గరకు తీసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు.
రేషన్ బియ్యం - డబ్బు ఇస్తే కేసు లేదా..?
రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసుల్లో కూడా డబ్బుల దందా నడిచిందంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.
పట్టుబడిన వాళ్లు...
సీజ్ చేసిన వాహనాలు...
కొన్ని గంటల్లోనే మాయమైపోయేవని స్థానికులు చర్చించుకుంటున్నారు.
"డబ్బు ఇస్తే కేసు లేదు..."
అనే మాటలు వినిపించేవని వాదనలు ఉన్నాయి.

**నైట్ డ్యూటీ - వసూళ్ల డ్యూటీయా..?**

రాత్రి సమయంలో రోడ్లపై కనిపించిన వారిని బెదిరించి డబ్బులు తీసుకునేవారని కొందరు ఆరోపిస్తున్నారు.
"ఎక్కడికి...?"
"ఎవరవు...?"
అంటూ మొదలైన ప్రశ్నలు...
చివరికి "సర్దుకుపో" అనే మాటతో ముగిసేవట.
నైట్ డ్యూటీ అంటే భద్రత కాదు...
వసూళ్ల రౌండ్ అన్న భయం ప్రజల్లో పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.

**రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ - భారీ డీల్ మిస్టరీ**

రిటైర్మెంట్ తీసుకున్న ఓ సబ్ రిజిస్ట్రార్‌ను కూడా కేసుల పేరుతో భయపెట్టి...
మధ్యలో బ్రోకర్ పెట్టుకుని భారీ మొత్తంలో డబ్బులు గుంజారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఈ వ్యవహారంలో డబ్బు చేతులు మారినట్టు బాధితులు చెబుతున్నారు.
రియల్ ఎస్టేట్ నుంచి రియల్ బిల్డర్ల వరకు...
చిన్న వ్యాపారుల నుంచి...
పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల వరకు...
ఎవరూ మినహాయింపు కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.
స్థానిక రియల్ బిల్డర్లను కూడా టార్గెట్ చేసి భారీ మొత్తాలు వసూలు చేశారనే ఆరోపణలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి.
ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి...
ఒక "నేర సామ్రాజ్యం" నిర్మించుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రాజకీయ అండ కోసం బాదంపప్పు పరుగు..?**

తనపై పెరుగుతున్న ఆరోపణలు...
ఏసీబీ ట్రాప్‌లు...
షోకాజ్ నోటీసులు...
సస్పెన్షన్ భయం...
ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర స్థాయిలో ఓ బడా రాజకీయ నాయకుడిని రహస్యంగా కలిసినట్టు విశ్వసనీయ సమాచారం వినిపిస్తోంది.
ఆ భేటీ వెనుక అసలు ఉద్దేశం ఏమిటి..?
రాజకీయ రక్షణ కోసమేనా..?
లేక విచారణలు ఆగిపోవడానికా..?
అన్న ప్రశ్నలు ఇప్పుడు తాడేపల్లిగూడెంలో హాట్ టాపిక్‌గా మారాయి.

**క్లైమాక్స్**

ప్రస్తుతం బాధితుల సంఖ్య పెరుగుతోందని పెన్ పవర్‌కు సమాచారం అందుతోంది.
ఇప్పటివరకు భయంతో మౌనంగా ఉన్నవాళ్లు...
ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.
ప్రజల్లో ఒక్కటే ప్రశ్న---
ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందిస్తారా..?
మధ్యవర్తుల పాత్రపై విచారణ జరుగుతుందా..?
ఆర్థిక లావాదేవీలు బయటపడతాయా..?
లేక...

**ఇవన్నీ కూడా మరో "సెటిల్మెంట్"తో ముగిసిపోతాయా..?**

**పెన్ పవర్ పిలుపు**

**మీరు కూడా బాధితులేనా..?**
**మీ వద్ద ఆధారాలున్నాయా..?**
**భయపడకండి...**
**మీ పేర్లు గోప్యంగా ఉంచబడతాయి.**
**"ఒక గడ్డిపరక బలహీనమే కావచ్చు...**
**కానీ వంద గడ్డిపరకలు కలిస్తే ఉరితాడు కూడా తయారవుతుంది..."**
**సంప్రదించండి : 9059465965**

**ఎపిసోడ్ -- 7లో...**
**యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ క్లైమ్ కోసం సర్టిఫైడ్ కాపీ ఇవ్వడానికి అక్షరాల ఐదు లక్షల డిమాండ్..?**
**చికెన్ వ్యర్థాల వ్యాన్ల నుంచి నెల నెలా మామూళ్లు ఇవ్వలేదని కేసుల బెదిరింపులా..?**
**పెన్ పవర్ దర్యాప్తు కొనసాగుతుంది...**

# కంబాలా..? పసుమర్తినా..? అసలు పేరు ఏది..?

**పెన్ పవర్ ఇన్వెస్టిగేషన్ నెట్వర్క్ తూర్పుగోదావరి జిల్లా నుంచి మే 19:** ఒక వ్యక్తి ప్రజా జీవితంలోకి రావచ్చు... సేవా కార్యక్రమాలు చేయచ్చు... ఆధ్యాత్మిక వేదికలపై ప్రసంగాలు ఇవ్వచ్చు... రాజకీయ నాయకులతో వేదికలు పంచుకోవచ్చు... కానీ అదే వ్యక్తి అసలు గుర్తింపుపై ప్రజల్లో అనుమానాలు మొదలైతే..?
అక్కడి నుంచే మొదలవుతుంది అసలు కథ.
ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్‌గా మారింది.
"కంబాల శ్రీనివాసరావు"గా విస్తృత ప్రచారం పొందిన వ్యక్తి... కొన్ని అధికారిక పత్రాల్లో మాత్రం "పసుమర్తి శ్రీనివాసరావు"గా ఉన్నారనే ప్రచారం ఇప్పుడు కొత్త అనుమానాలకు దారి తీస్తోంది.
ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే –
రెండు ఇంటిపేర్లు ఎందుకు..? అసలు నిజం ఏంటి..?
ప్రజా వేదికలపై ఒక పేరు... అధికారిక వ్యవహారాల్లో మరో పేరు..?
స్థానికంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా శిబిరాలు, సామాజిక సమావేశాలు, రాజకీయ వేదికల్లో "కంబాల శ్రీనివాసరావు" పేరే ఎక్కువగా వినిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు.
అయితే కొన్ని అధికారిక వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకింగ్ డాక్యుమెంట్లలో మాత్రం "పసుమర్తి శ్రీనివాసరావు" అనే పేరు వినిపిస్తోందన్న ప్రచారం కొత్త చర్చకు కారణమైంది.
ఒకే వ్యక్తి రెండు వేర్వేరు ఇంటిపేర్లతో కొనసాగడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి..?
అది కుటుంబ సంప్రదాయమా..?
లేక మరేదైనా వ్యూహమా..?
అనే అనుమానాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ




చర్చనీయాంశమవుతున్నాయి.
అసలు పేరు ఏది..? ప్రజల్లో పెరుగుతున్న సందేహాలు
ప్రస్తుతం ప్రజల్లో వినిపిస్తున్న కీలక ప్రశ్నలు ఇవే:
అసలు ఇంటిపేరు కంబాలా..?
లేక పసుమర్తినా..?
ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతాలు ఏ పేరుతో ఉన్నాయి..?
ఆస్తుల రికార్డులు ఏ పేరుతో నమోదయ్యాయి..?
భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేస్తే ఏ పేరుతో అఫిడవిట్ దాఖలు చేస్తారు..?
రెండు పేర్ల వినియోగం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి..?
ఈ ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం రాకపోవడంతో ప్రజల్లో మరింత ఉత్కంఠ పెరుగుతోంది.
గుర్తింపు విషయంలో గందరగోళమా..? లేక వ్యూహాత్మక ముసుగా..?
స్థానికులు చెబుతున్నదేమిటంటే...
గ్రామాల్లో, పట్టణాల్లో జరిగే కార్యక్రమాల్లో "కంబాల" పేరు ప్రధానంగా వినిపిస్తుండగా... అధికారిక వ్యవహారాల్లో వేరే పేరు వినిపించడం ప్రజల్లో అనుమానాలకు దారి తీస్తోందని అంటున్నారు.
కొంతమంది రాజకీయ విశ్లేషకులు మాత్రం ఇది కుటుంబ ఇంటిపేరు మార్పు మాత్రమే కావచ్చని అభిప్రాయపడుతున్నారు.
అయితే మరికొందరు మాత్రం ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి విషయంలో పూర్తి పారదర్శకత అవసరమని చెబుతున్నారు.
ఆర్థిక లావాదేవీలపై కూడా ప్రశ్నలు
పేరు మార్పు అంశం ఇప్పుడు కేవలం వ్యక్తిగత గుర్తింపు చర్చకే పరిమితం కాలేదు.
ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలు, బ్యాంకింగ్ వ్యవహారాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి.
ఒక పేరుతో ప్రజల్లో ప్రచారం...
మరో పేరుతో అధికారిక వ్యవహారాలు...
ఇది భవిష్యత్తులో చట్టపరమైన వివాదాలకు దారి తీసే అవకాశముందని కొందరు న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
న్యాయ నిపుణులు ఏమంటున్నారు..?
ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు తమ వ్యక్తిగత, ఆర్థిక, అధికారిక వివరాల్లో పారదర్శకత పాటించాల్సిన బాధ్యత ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.
ప్రజల నుంచి విరాళాలు స్వీకరించే వ్యక్తి అయితే మరింత స్పష్టత అవసరమని వారు సూచిస్తున్నారు.
ఒక పేరుతో ప్రజా ప్రచారం నిర్వహిస్తూ... మరో పేరుతో అధికారిక లావాదేవీలు జరిపితే భవిష్యత్తులో అనేక చట్టపరమైన ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.
స్పష్టత ఇవ్వాల్సింది ఎవరు..?
ఈ వివాదానికి పూర్తి తెరపడాలంటే సంబంధిత వ్యక్తే ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.
"రెండు పేర్లు ఎందుకు వాడుతున్నారు..?"
"అసలు ఇంటిపేరు ఏది..?"
"అధికారిక రికార్డుల్లో ఉన్న పేరు ఏమిటి..?"
అన్న ప్రశ్నలకు ప్రజలు సమాధానం కోరుతున్నారు.

**ఇది కేవలం ప్రారంభమేనా..?**

పేరు మార్పు చర్చ ఇప్పుడు రాజకీయ, సామాజిక, ఆర్థిక కోణాల్లో కొత్త అనుమానాలకు దారి తీస్తోంది.
ఈ వ్యవహారంలో ఇంకా బయటకు రాని అనేక కోణాలు ఉన్నాయన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది.

**పెన్ పవర్ పరిశోధన కొనసాగుతుంది...**

ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు...
ఆర్థిక లావాదేవీలు...
సంబంధాల వలయం...
అధికారిక పత్రాల్లో బయటపడుతున్న కొత్త వివరాలు...

**ఎపిసోడ్ -3లో మరిన్ని సంచలన విషయాలతో ముందుకు రానుంది పెన్ పవర్..!**

పెన్ పవర్

మార్కాపురం - ప్రకాశం

# మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

### - మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

### - మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా చెక్కుల పంపిణీ

### - పాల్గొన్న జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, బి.ఎన్ విజయకుమార్





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 19**

కడలిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో ఆర్థిక సహాయాన్ని జమ చేసే జిల్లా స్థాయి కార్యక్రమం మంగళవారం ప్రకాశం భవనంలో జరిగింది. మంత్రి స్వామితో పాటు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ( ఒంగోలు),బి.ఎన్.విజయ్ కుమార్ ( సంతనూతలపాడు ) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొని మత్స్యకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాన్ని ప్రజా ప్రతినిధులతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకారులు వీక్షించారు. అనంతరం మత్స్యకారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ పెన్షన్ పొందేందుకు వయోపరిమితి తగ్గింపు, సబ్సిడీపై డీజిల్ సరఫరా, రాయితీపై పడవలు, వలలు అందజేత వంటి సంక్షేమ కార్యక్రమాలకు తమ ప్రభుత్వం మొదటి నుంచీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు మత్స్య సంపద పెరిగేలా రెండు నెలల పాటు సముద్రంలో మిషన్ బోట్ల ద్వారా వేటపై నిషేధం ఉన్నట్లు చెప్పారు. ఈ రెండు నెలల పాటు మత్స్యకారుల జీవనోపాధి కోసం గతంలో రూ.10 వేల చొప్పున చేసే ఆర్థిక సహాయాన్ని కూటమి ప్రభుత్వం 20 వేలకు పెంచిందని తెలిపారు. ఈ విధంగా 2026 - 27 సంవత్సరానికి ప్రకాశం జిల్లాలో 8694 మంది మత్స్యకారులకు రూ.17.38 కోట్ల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అందజేస్తున్నట్లు మంత్రి చెప్పారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సోనా బోట్ల సమస్యను సమర్థంగా ఎదుర్కోవటంపై దృష్టి పెట్టామన్నారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. తీర ప్రాంత గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు ఫిషింగ్ హార్బర్ ను మత్స్యకారులకు అందుబాటులోకి తెచ్చేలా తీసుకుంటున్న చర్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం బీసీలకు, ముఖ్యంగా మత్స్యకారులకు అన్నివేళలా అండగా ఉంటున్నట్లు చెప్పారు. పొడవైన తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి మత్స్య సంపద రూపంలో ఆదాయం రావడంతో పాటు సముద్రాన్ని నమ్ముకున్న మత్స్యకారులు కూడా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను మత్స్యకారులందరూ వినియోగించుకోవాలని సూచించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా కలుగుతున్న ఆర్థిక ప్రయోజనానికి సంబంధించిన మెగా బ్యాంక్ చెక్కును మంత్రి, ఎమ్మెల్యేలు, జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా మత్స్యకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు పేరయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథంతో పర్యావరణ మార్పు

### - పరిసరాల పరిశుభ్రతే సమాజ లక్ష్యం -ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మే 19**

గిద్దలూరు నియోజకవర్గం బేస్తవరిపేట మండలం ఎంపిడిఓ కార్యాలయం లో గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత , వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని కలెక్టర్ , ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వచ్ఛ రథం కేవలం చెత్త సేకరణ వాహనం మాత్రమే కాదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చే ఒక సామాజిక ఉద్యమమని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్, ఇనుము, కాగితం వంటి వ్యర్థాలను పారవేయకుండా, వాటిని తిరిగి వినియోగించుకునే (రీసైక్లింగ్) అలవాటును పెంపొందించడం ముఖ్య ఉద్దేశమన్నారు "వినియోగించని వస్తువులను ఇవ్వండి -- సరుకులు పొందండి" అనే నినాదంతో ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ, వ్యర్థాల బదులుగా నిత్యావసర సరుకులు అందించడం ద్వారా ప్రజల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నామని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నిల్వలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా సేకరించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడాన్ని నిరోధించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని తెలిపారు. దీంతో దోమల పెరుగుదల తగ్గి, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నివారించవచ్చన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్ , డస్ట్ బిన్ల పంపిణీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని పచ్చ జెండా ఊపి ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. మన గిద్దలూరు మండలానికి 35 రిక్షాలు, గ్రీన్ అంబాసిడరెస్ అయిన మీరు మీకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రతి ఒక్కరూ 250 గృహాల నుండి చెత్త సేకరించి పరిశుభ్రం గా ఉంచడంలో మీది ముఖ్య పాత్ర పోషిస్తున్నారు కావున గ్రామాలు, పట్టణాలు శుభ్రంగా ఉండేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీతో చెత్త సేకరణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని కూటమి ప్రభుత్వం అభివృద్ధి లో ముందు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 2029 నాటికి సంపూర్ణ పేదరిక నిర్మూలనే లక్ష్యం

### పి 4 కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత





**గిద్దలూరు పెన్ పవర్ మే 19**

బేస్తవారిపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పి4 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో 2029 నాటికి సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా నడుం బిగించాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని ఆర్థికంగా బలమైన టాప్ 10 శాతం వర్గాలు అత్యంత పేద 20 శాతం కుటుంబాలను దత్తత తీసుకుని వారికి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. పేద కుటుంబాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగడానికి మార్గనిర్దేశం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చిన్న సహాయంతోనే పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మార్చవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడం నేర్చుకోవాలని, పరోపకారం ద్వారానే అసలైన ఆత్మసంతృప్తి లభిస్తుందని కలెక్టర్ అన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని పేదరికాన్ని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రవేశపెట్టిన ఇటువంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బేస్తవారిపేటలో మొదటి విడతగా 100 కుటుంబాలను దత్తత తీసుకున్న సెయింట్ ఫౌండేషన్‌ను ఆయన అభినందించారు. ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందిన సెయింట్ ఫౌండేషన్ ఫౌండర్ బీవీఆర్ మోహన్ రెడ్డి 716 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ప్రశంసించారు. పేద ప్రజలు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, డీఎల్డీఓ బాలు నాయక్, ఎంపీడీవో రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, మే 19:**

మత్స్యకారుల సేవలో పథకం అమలులో భాగంగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసేందుకు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈ ఉదయం కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామానికి విచ్చేశారు. మంత్రులు, సహచర శాసనసభ్యులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి కి స్వాగతం పలికారు.





# అమావాస్యకు ఒకసారి వచ్చే బుర్రా నువ్వు కూడా మాట్లాడితే ఎలా..?

### కందుకూరులో అభివృద్ధి తప్ప, అవినీతి ఎక్కడుంది.. ?

### ఉత్తుత్తి ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

### -సబ్జెక్ట్ తెలుసుకుని మాట్లాడండి

### -బుర్రా మధుసూదన్ కు ఎమ్మెల్యే ఇంటూరి ఘాటు హెచ్చరిక

### -ప్రభుత్వ స్థలాలు పరులపాలు కానివ్వం

### -నియోజకవర్గ అభివృద్ధి తప్ప, నాకు వేరే ఆలోచన లేదు

### మాలకొండ సాక్షిగా చెబుతున్నా ఒక్క రూపాయి కూడా అవినీతి జరగనివ్వను

### కొందరి ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, మే 19**

కందుకూరులో అభివృద్ధి తప్ప అవినీతి ఎక్కడ లేదని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరులోని టిడిపి కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పలువురు నాయకులు మీడియాతో మాట్లాడారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అమావాస్యకో, పౌర్ణమికో కందుకూరు వచ్చిపోయే బుర్రా మధుసూదన్, కనీస పరిజ్ఞానం లేకుండా నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. విషయం ఏమిటో తెలుసుకోకుండా గుడ్డకాల్చి ముఖానవేసి వెళ్లడం అతనికి అలవాటు. ఆయన చెబుతున్నట్టు, కందుకూరులో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగడం లేదు. అభివృద్ధి ఏ స్థాయిలో జరుగుతుందనేది ప్రజలను అడిగితే తెలుస్తుంది. నాకు అభివృద్ధి తప్ప వేరే ఆలోచన లేదు అని అన్నారు. వైసిపి పాలనలో మాలకొండ ఆదాయం 3.09 కోట్లు ఉంటే మేము అధికారంలోకి వచ్చాక, మొదటి ఏడాది 4.16 కోట్లు, ఈ ఏడాది 4.46 కోట్లు ఆదాయం తీసుకొచ్చాం. అభివృద్ధి పనులు కూడా అంతే వేగంగా చేస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా, నా ఇష్టదైవం నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి పనిచేస్తుంటే, కొందరు పనిగట్టుకుని తలతిక్క ఆరోపణలు చేయడం సరికాదు అని అన్నారు. మాలకొండ దేవస్థానానికి సంబంధించి 450 ఎకరాలు భూమిని, ఎన్నో ఏళ్లుగా ఆన్లైన్ లో నమోదు చేయలేదు. తాను ఎమ్మెల్యే అయ్యాక, ఆ భూమిని సర్వే చేయించి, ఆన్లైన్ చేయించాను. స్వామివారికి ఈ విధంగా సేవ చేయటం నా అదృష్టం. అలాగే గత ప్రభుత్వంలో పెండింగ్ బకాయిలను కూడా, ఈ ప్రభుత్వంలో వసూలు చేయడం జరిగింది అని అన్నారు. కందుకూరు పట్టణంలో అంకమ్మ తల్లి ఆలయం ఎదురుగా, 1993లో జగన్నాథం నాగయ్య అనే వ్యక్తి పేరుమీద నకిలీపట్టా సృష్టించారు. గతంలో సదరు సర్వే నెంబర్ లో 75 ప్లాట్లు ఇచ్చినట్లు ప్రభుత్వ రికార్డులలో ఉండగా, కొత్తగా 76వ ప్లాట్ ఇచ్చినట్లు చేతిరాతతో పట్టా తయారు చేశారు. అది నకిలీ పట్టా అని అధికారులు తేల్చారు. పట్టణములో భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని కొందరు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు అని అన్నారు. వైసీపీనేతలు ఆరోపణలతో, సాక్షి మీడియా రాతలతో పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఏదైనా తప్పు జరిగితే వేలు పెట్టి చూపించండి. వెంటనే సరిదిద్దుకుంటాం. అంతేకానీ ఏదో జరిగిపోతోందన్న అవాస్తవాలతో ప్రజల్ని మభ్యపెట్టొద్దు. కష్టపడే వారిపై బురదజల్లడం మానుకొని, ఈసారైనా ప్రతిపక్ష హోదా కోసం ప్రయత్నించాలని వైసిపి నేతలకు సలహా ఇస్తున్నాను అని అన్నారు. వైసిపి పాలనలో దళితులపై అనేక దాడులు జరిగి వేల మంది ప్రాణాలు కోల్పోయారు. డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం లాంటి ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారు. జగన్ చేసిన పాపాలను దళిత జాతి మరిచిపోదు. అయినప్పటికీ ఇంకా వారిని మోసం చేయాలని వైసిపి నేతలు ప్రయత్నిస్తూ ఉండడం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఘాటుగా విమర్శించారు. అలాగే యుద్ధం కారణంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే... దానిపై వైసీపీ నేతలు నిరసన తెలపటం సిగ్గుచేటని ఎమ్మెల్యే విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ... మత్స్యకారుల సేవలో పథకానికి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు. రాజధాని అమరావతి, పోలవరం, వెలిగొండ నిర్మాణాలతో పాటు అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చి అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కొనియాడారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గుడ్లూరు మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నాదెళ్ల వెంకటరమణయ్య, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, ఎస్సీ నేతలు రాయపాటి శ్రీనివాసరావు, సుదర్శి శ్యామ్, మెండా లెనిన్, బద్దిపూడి శిఖామణి, మట్టిగుంట శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

# గుండంచర్ల చెంచు కాలనీలో 'జన్ బాగిదారి' గ్రామ సభ



పెద్దారవీడు, మే 19 పెన్ పవర్

మండల పరిధిలోని గుండంచర్ల గ్రామ పంచాయతీ చెంచు కాలనీ నందు మంగళవారం 'జన్ బాగిదారి' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో స్థానిక చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలు, వారి దైనందిన సమస్యలతో పాటు ముఖ్యంగా ఆరోగ్య సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి మరియు వారి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే వైద్య సిబ్బంది సమక్షంలో స్థానికుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు.ఈ ప్రత్యేక గ్రామ సభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. జాన్ సుందరం, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎ. శ్రీహర్ష, గ్రామ రెవెన్యూ అధికారి ఆదినారాయణ, స్వర్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య మరియు అంగన్‌వాడీ సిబ్బందితో పాటు మాజీ సర్పంచ్ ఇండ్ల రామకృష్ణా రెడ్డి, చెంచు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

## - ట్రాఫిక్ సీఐ హజరతయ్య


## - 15మంది వాహన చోదకులకు జరిమానా



క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 19

మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, త్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని వాహనదారులందరూ మోటార్ వెహికల్ నిబంధనలను పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవు అని ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్ హజరతయ్య పేర్కొన్నారు. వాహన తనిఖీలలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 15 మందిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా 15 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి =ం. 10,000/- చొప్పున =ం.1,50,000/- జరిమానా విధించారని సిఐ తెలిపారు.

# ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన గిద్దలూరు ఎంఈవో నల్లబోతుల అశ్వనీ కుమార్



గిద్దలూరు పెన్ పవర్ మే 19

ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి ని కార్యాలయంలో గిద్దలూరు మండల విద్యాశాఖాధికారి నల్లబోతుల అశ్వనీ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, బోధన విధానాలు తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారి కి సమగ్రంగా వివరించారు. మండలంలోని విద్యా పరిస్థితులపై ప్రత్యేక నివేదికను అందించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంపై కూడా విస్తృతంగా చర్చించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విధానం, డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించే చర్యలు, తల్లిదండ్రులతో నిర్వహిస్తున్న సమావేశాలు వంటి అంశాలను జిల్లా విద్యాశాఖాధికారి కి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను కూడా తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సూచించినట్లు తెలిసింది. గిద్దలూరు మండలంలో విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తామని మండల విద్యాశాఖాధికారి నల్లబోతుల అశ్వనీ కుమార్ తెలిపారు.

# బహుముఖ కార్యకలాపాలకు వేదికగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిలవాలి

## మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు. నాగరాజు ఆకాంక్ష

## సానికవరంలో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన భవనం ఘనంగా ప్రారంభం

పెద్దారవీడు పెన్ పవర్ మే 19

పుచ్చలపల్లి సుందరయ్య ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి అని మార్కాపురం డిఎస్పి డాక్టర్ యు నాగరాజు కొనియాడారు. సుందరయ్య పేరుతో ఎన్నో విజ్ఞాన కేంద్రాలు వెలిశాయని, అవన్నీ బహుముఖ కార్యకలాపాలకు నెలవుగా నిలిచేయన్నారు. పెద్దారవీడు మండలం సానికవరంలో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించిన పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కూడా ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నూతన భవనాన్ని డిఎస్పి డాక్టర్ నాగరాజు మంగళవారం ప్రారంభించారు. లైబ్రరీ అండ్ రీడింగ్ రూమ్ లను శ్రావణి హాస్పిటల్ అధినేత, రెడ్ క్రాస్ సొసైటీ మార్కాపురం బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ప్రారంభించారు. కీర్తిశేషులు గుంటక సత్యనారాయణ రెడ్డి మీటింగ్ హాలును మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య, గుంటక సత్యనారాయణరెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు గోపి దేశం మల్లయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కాపురం డిఎస్పి డాక్టర్ డాక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య అందరివాడిగా ఉండాలని లక్ష్యంతో తన పేరులో నుండి రెడ్డి తొలగించుకున్నారు. ఆయన వందలాది ఎకరాలకు భూస్వామి అన్నారు. చిన్నతనం నుండే ప్రజల కష్టంలో పాలుపంచుకోవాలని తపనతో పెరిగారన్నారు. మహాత్మా గాంధీ ఇచ్చిన ఉప్పు సత్యాగ్రహం పిలుపులో వాలంటీర్ గా సుందరయ్య పాల్గొన్నారు. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో అగ్రనేతగా ఎదిగారన్నారు. కులం, మతం, రాజకీయ పార్టీల కతీతంగా సుందరయ్య కొనియాడ పడుతున్నారన్నారు. ఆయన సమాజం కోసం, వివిధ ప్రజల కోసం పనిచేయడంతో కీర్తింపబడుతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలో పుట్టి పెరిగిన సుందరయ్య గురించి మాకు బాగా తెలుసు అన్నారు. మాది కూడా నెల్లూరు జిల్లా కావడంతో మా నాన్నకు సుందరయ్య సాన్నిహిత్యం ఉందన్నారు. వేలాది ఎకరాల భూములు సైతం పేదలకు పంచిపెట్టిన ఘనత ఆయనదేనన్నారు. సుందరయ్య కుటుంబీకులు డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో నెల్లూరులో నేటికీ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం ధారపోశారన్నారు. పిల్లలు పుడితే ఎక్కడ స్వార్థం పెరుగుతుందోనని పెళ్లికి ముందే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి





సుందరయ అని కొనియాడారు. అలాంటి మహనీయులు మళ్లీ పుట్టాలని ఆకాంక్షించారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రావణి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య త్యాగం వర్ణించలేనిది అన్నారు. ఆయన ప్రజల కోసమే జీవించారన్నారు. అలాంటి రాజకీయ నేతలు నేటి కాలంలో మచ్చుకైనా కానరావడం లేదన్నారు. ఆయన ఈ సమాజానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ద్వారా అందించే ప్రజా సేవా కార్యక్రమాల్లో తన వంతు పాత్ర కూడా ఉంటుందన్నారు. సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సుందరయ్య రాజ్యసభకు ఎన్నికై, ప్రతిపక్ష నేతగా వ్యవహరించారన్నారు. ప్రపంచంలో ఉత్తమ పార్లమెంటేరియన్ గా కొనియాడ పడ్డారన్నారు. సుందరయ్య ప్రజల పక్షాన మాట్లాడుతుంటే ప్రధానమంత్రి నెహ్రూ, ఆయన మంత్రివర్గ సహచరులు కూడా సుందరయ్య వల్లించే ప్రతి మాటను నోట్ చేసుకునే వారన్నారు. ఆ దిశగా పనులు కూడా చేసేవారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రతిపక్షక నేతగా సుందరయ్య వ్యవహరించిన తీరు మర్చిపోలేమన్నారు. ఆయన నోటి నుండి వెలువడే ప్రతి మాట సమాజం కోసమే ఉంటుందని గుర్తు చేశారు. నిరాడంబరతకు ఆయన నిలువెత్తు సాక్ష్యం అన్నారు. పార్లమెంటుకు సైతం సైకిల్ పై ప్రయాణించే వారన్నారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం పుస్తకాన్ని రచించారన్నారు. పుస్తకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిక అవసరమైన సూచనలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణంలోని వెలుగొండ ప్రాజెక్టు కూడా ఆ పుస్తకంలో ముందు చూపుతో రచించారన్నారు. వెలుగొండను పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో కరువు మాయమవుతుందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రాలు పార్టీల కతీతంగా నిర్వహణలో ఉంటాయన్నారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, బహుముఖ కార్యకలాపాల వేదికగా పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహణ కొనసాగాలని ఆకాంక్షించారు. జెవివి రాష్ట్ర కమిటీ తరపున సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహణ కోసం రూ. లక్ష చెక్కును డాక్టర్ కనకదుర్గ, డి.ఎస్.పి నాగరాజు చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు. సిపిఎం సీనియర్ నాయకులు స్వర్గీయ ఏనుగుల పుల్లయ్య మనవళ్లు ఏనుగుల సురేష్ కుమార్, ఏనుగుల రవికుమార్లు సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి 50 కుర్చీలు బహుకరిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుడు వద్దులే రవిశేఖర్ రెడ్డి విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పలు రకాల పుస్తకాలను లైబ్రరీ లో ఉంచేందుకు అందజేశారు. వార్త బ్యూరో ఇన్చార్జ్ మూల అల్లూరి రెడ్డి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి రూ. 5 ఐదువేల విలువ చేసే పుస్తకాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సభలో జే వి వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి రాష్ట్ర నాయకులు మురళీధర్, పి స్వరూప రెడ్డి, సిహెచ్ జయప్రకాష్, ఏనుగుల రవికుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దగ్గుపాటి సోమయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒద్దుల వెంకట వీరారెడ్డి, పెదరాయుడు ఎస్ఐ ఎం సైదుబాబు, డీకే రఫీ, గుమ్మా బాల నాగయ్య, ఏనుగుల సురేష్ కుమార్,గుంటక యోగి రెడ్డి, బొచ్చు శివ శంకర్ రెడ్డి, దొడ్డ సుబ్బారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు నూకాన్ వెంకటరమణ. ఆ సంఘం నాయకులు మూల అల్లూరి రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# రోళ్ళపాడులో ఊపందుకున్న ఉపాధి హామీ పనులు

## వలసలకు చెక్.. గ్రామాల్లోనే కూలీలకు ఉపాధి

## సకాలంలో వేతనాలు అందడంతో కార్మికుల్లో ఆనందం



వలేటివారిపాలెం, పెన్ పవర్ మే 19

మండలంలోని రోళ్ళపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సీనియర్ మేట్ మురళి ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్నాయి. వేసవి కాలంలో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే కూలీలకు ఈ పనులు పెద్ద అండగా నిలుస్తున్నాయి. గ్రామాల్లోనే ఉపాధి లభించడంతో కుటుంబాలను విడిచి వెళ్లాల్సిన అవసరం లేకుండా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జలధార - జల హారతి కుంటలో పూడికతీత పనులు, చెరువుల అభివృద్ధి, వంటి పనులు కొనసాగుతున్నాయని చెబుతున్నారు . ప్రతిరోజూ వందల మంది మహిళలు, పురుషులు ఈ పనుల్లో పాల్గొంటూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో పనులు లేక ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్ళేవారు . ప్రస్తుతం గ్రామాల్లోనే ఉంటూ పనులు చేసుకుంటున్నారని అంటున్నారు. స్థానికంగా పనులు దొరకడంతో ప్రయాణ ఖర్చులు, ఇబ్బందులు తప్పుతున్నాయని కూలీలు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు ప్రభుత్వం సకాలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు పనులు వేతనాలు జమ చేస్తుండటంతో ఆనందంగా ఉందని చెబుతున్నారు. బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ కావడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా డబ్బులు అందుతున్నాయని కూలీలు తెలిపారు. గ్రామాభివృద్ధికి దోహదం ఉపాధి హామీ పనిలో భాగంగా జలధార- జల హారతి పనులు చేపట్టడం శుభపరిణామం అన్నారు. రాబోయే వర్షాకాలంలో కురిసిన ప్రతి వర్షపు నీటి బొట్టును వృదా పోకుండా కట్టడి చేస్తామని కూలీలు చెబుతున్నారు . నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు గ్రామాలకు ఉపయోగకరంగా మారుతున్నాయి. దీని వల్ల భవిష్యత్తులో వ్యవసాయానికి కూడా మేలు జరుగుతుందని వారే చెబుతున్నారు.

# జిల్లా బిజెపి నేత కృష్ణారావును కలసిన ఖాదర్ భాష



పొదిలి, పెన్ పవర్, మే 19

మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షులుగా నియమితులైన పివి కృష్ణారావును జిల్లా బిజెపి మైనారిటీ మోర్చా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష కలిశారు. మంగళవారం నాడు ఖాదర్ బాషా మార్కాపురంలో కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావును ఖాదర్ భాషా శాలువాతో సత్కరిం చి, తమ శుభాకాంక్షలు తెలియజేశారు. కృష్ణారావును కలసిన వారిలో ఖాదర్ భాష తో పాటు బిజెపి నాయకులు డాక్టర్ కిరణ్, ఎం రామకృష్ణ, కే శ్రీకాంత్, ఎం శివప్రసాద్, బి వి ఆర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# గ్రామ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలి

## రెడ్డి గారి పల్లి లో జిపిడిపిపై అవగాహన శిక్షణ

## రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్ భాస్కర్ రావు






సి ఎస్ పురం, పెన్ పవర్ మే 19

గ్రామాల సమగ్రాభివృద్ధికి పది సంవత్సరాల అభివృద్ధి లక్ష్యాలతో ప్రణాళికలను రూపొందించాలని రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్.భాస్కర్ రావు అన్నారు మండలంలోని రెడ్డిగారికొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిగారిపల్లి ఆవాస గ్రామ సచివాలయంలో మంగళవారం రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై అవగాహన శిక్షణ కార్యక్రమం ను గ్రామపంచాయతీ కార్యదర్శి పి.ఉమా అధ్యక్షతన ఈడబ్ల్యూఎస్ పర్యవేక్షణలో రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్ భాస్కర్ రెడ్డి వ్యవహరించారుఈ సందర్భంగా డాక్టర్ ఎస్. భాస్కర్ రావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలతో ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలోని మౌలిక వసతులు, రహదారులు, త్రాగునీటి సదుపాయాలు, సాగునీటి వనరులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సేవలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని రాబోయే పది సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.గ్రామాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చెట్ల పెంపకం, భూగర్భ జలాల పెంపుదల, నీటి సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయితేనే ప్రభుత్వ లక్ష్యాలు సాకారం అవుతాయని తెలిపారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెడ్డిగారికొత్తపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకునే విధానం పై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డి నాగరాజు, అంగన్వాడి సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే సుందరయ్య ఆశయాల లక్ష్యం

## ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి



సి ఎస్ పురం, పెన్ పవర్ మే 19

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆశయాలు నెరవేర్చడమే మనము ఆయనకు ఇచ్చే నివాళి అని సిపిఎం పార్టీ మార్కాపురం జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక నారాయణస్వామి కాంప్లెక్స్ లో మంగళవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య సైకిల్ మీద పార్లమెంట్ కి వెళ్ళేవాడని ఇది ఆయన నిరాడంబర జీవితానికి నిదర్శనం అన్నారు. వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం సొంత గ్రామం నుంచి ఉద్యమాలు చేపట్టిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు అన్నారు. ప్రస్తుత పాలకులు ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నా రన్నారు. పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న పాలకులపై పోరాటాలు చేయడం ద్వారా సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఊసా రాజ్యలక్ష్మి, సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, కొండలరావు, శ్రీనివాసరెడ్డి, బత్తుల జ్ఞానరాజు, రాంబాబు, ఇమ్మానుయేలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా, సంక్షేమం అమలులో వెనకడుగు వేయం -ఎమ్మెల్యే ఇంటూరి

## -కూటమి ప్రభుత్వంలోనే మత్స్యకారులకు మేలు -సముద్రతీర గ్రామాలను చక్కగా అభివృద్ధి చేస్తున్నాం

## -మత్స్యకారుల సేవలో పథకం నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

## -కందుకూరు నియోజకవర్గంలో 2,482 కుటుంబాలకు 4.96 కోట్లు విడుదల





**కందుకూరు/ ఉలవపాడు పెన్ పవర్, మే 19:**
మత్స్యకారుల సేవలో పథకం ద్వారా, వేట విరామ సమయంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న నిధులు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం విడుదల కాగా ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని అలగాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఒక్కో లబ్ధిదారు కుటుంబానికి 20 వేల రూపాయల చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉలవపాడు మండలంలో 2,230 కుటుంబాలకు 4. 46 కోట్ల రూపాయలు, గుడ్లూరు మండలంలో 252 కుటుంబాలకు 50.4 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. మొత్తంగా కందుకూరు నియోజకవర్గంలోని 2,482 మత్స్యకార కుటుంబాల ఖాతాల్లో 4.96 కోట్లు జమ అయ్యాయని వివరించారు. 217 జీవో రద్దు, వేట సమయంలో ఆర్థిక సహాయం, బోట్ల రిజిస్ట్రేషన్, హైస్పీడ్ బోట్ల నిషేధం లాంటి విషయాలలో కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వంలో మత్స్యకార గ్రామాలలో అభివృద్ధి పనులు జరగలేదని, తమ ప్రభుత్వంలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, తాగు సాగునీటి వసతి, స్మశానాల అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. గత ఎన్నికల్లో మత్స్యకార కుటుంబాలు తనకు అండగా నిలిచాయని ఎమ్మెల్యే చెబుతూ వారు తన దృష్టికి తీసుకువస్తున్న ప్రతి చిన్న సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. మత్స్యకారుల కోసం రామాయపట్నం సమీపంలో 4.5 ఎకరాల విస్తీర్ణంలో, సుమారు 28 కోట్ల రూపాయలతో జెట్టి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. దీనివల్ల బోట్లు నిలుపుదల, అన్ లోడింగ్, ప్లాట్ ఫారం లాంటి ఆధునిక వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. మత్స్యకార సేవలో.. పథకం ద్వారా నిధులు తమ అందరికీ ఖాతాల్లో జమ అయ్యాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ... ఎమ్మెల్యే నాగేశ్వరరావు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి ఎమ్మెల్యే, నాయకులు కలిసి పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, తహసిల్దార్ రవిశంకర్, మత్స్య శాఖ డివో రమేష్, మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీను, ఉపాధ్యక్షుడు కన్నా ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము, క్లస్టర్ ఇంచార్జ్ పోలుబోయిన శ్రీను, పార్టీ నాయకులు వాయిల శ్రీను, జాలమ్మ, వెంకట్రామిరెడ్డి, శ్రీకాంత్, కాటంగారి యానాది, బాలమురళి, రామదాసు, పోలిశెట్టి, చెంచురామిరెడ్డి, కొల్లి రమణ, పిగిలి రమణ, తేజ, అన్ని గ్రామ పార్టీల అధ్యక్షులు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమాలకు పునరంకితం -సిపిఎం పిలుపు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు మే 18**
పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజా ఉద్యమాలకు పునరంకితం అవుతామని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు, నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 28 ప్రాంతాల్లో పార్టీ జెండాలు ఎగరవేసి, సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి. రమేష్, తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ సుందరయ్య జీవితం నిరాడంబరతకు నిదర్శనమని కొనియాడారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాల నిర్మాణానికి ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. కార్మిక, రైతాంగ, మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించడంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నగర నాయకులు ఎన్. వీరాస్వామి, దామా శ్రీనివాసులు, ఘట్టమనేని శ్రీనివాసరావు , ఎస్.డి. హుస్సేన్, కొర్నిపాటి శ్రీనివాసులు, డి. వెంకటేశ్వర్లు, బేబీరావు తదితరులు పాల్గొన్నారు.

# డి ఎస్ పి బాల మురళిని కలసిన వాకా



**పొదిలి, పెన్ పవర్, మే 19**
దర్శి డివైఎస్పీ బాలమురళీకృష్ణ ను మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి కలుసుకున్నారు. బాలమురళీకృష్ణ నూతనంగా దర్శి డిఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మంగళవారం నాడు దర్శి లోని డి.ఎస్.పి కార్యాలయంలో బాలమురళిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకా వెంకటరెడ్డి తో పాటు తెలుగుదేశం నాయకులు మీగడ ఓబుల్ రెడ్డి, షేక్ మౌలాలి, ముల్లా రబ్బాని, ముల్లా గౌస్ బాషా తదితరులు కూడా పాల్గొన్నారు.

# ఎన్రోల్మెంట్ డ్రైవ్ కు మంచి స్పందన

## ఇంటింట ప్రచారంలో ప్రైవేటు విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేరిక

## ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరాలి

## ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 19**
విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపుదలకు చేపట్టిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ బృందం మరియు విద్యా కమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్ బి గ్రామంలోని పలువురు తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తున్న విద్యా సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదరున్నీసాబేగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వం నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేలా ఆధునిక బోధనా విధానాలు అమలు చేస్తున్నామని అన్నారు ప్రభుత్వం



పాఠశాలలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా అనేక సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షేక్ హుస్సేన్ బి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినతి పత్రం అందించిన రజక సంఘం కమిటీ సానుకూలంగా స్పందించినా ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మే 19**
గిద్దలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో " ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని రజక సంఘం , మదియలేశ్వర స్వామి సంఘ కమిటీ సభ్యులు కమ్యూనిటీ హాల్ గురించి సంప్రదించారు
సంఘ పెద్దలు మాట్లాడుతూ గిద్దలూరు నగరపంచాయితీ పరిధిలోని, పట్టణంలో సుమారు 800 వందల రజక కుటుంబాలు జీవనం నివసిస్తున్నాము అని గిద్దలూరు కొంగలవీడు రోడ్డు నందు 27 సెంట్ల స్థలములో మీ సహకారముతో 10 సెంట్లలో శ్రీ మడియాలేశ్వరస్వామి ఆలయ గుడి నిర్మాణం జరిగినదని. మిగతా 17 సెంట్లలో మా కుటుంబాలకు చెందిన వారము శుభకార్యములు, వివాహములు, ఇతర సమావేశములు నిర్వహించుకొనుటకు కమ్యూనిటీ హాలు అవసరము కావున తమరు శ్రీ మడియాలేశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఒక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి హాలు నిర్మాణానికి సహకారం అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సంఘం అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకోని వెళ్తానని , సంబంధిత అధికారులతో మాట్లాడి మీకు సహాయం అందేలా చూస్తాను అని తెలిపారు కార్యక్రమంలో గిద్దలూరు రజక అభివృద్ధి సంఘం మరియు శ్రీ మడియాలేశ్వర స్వామి గుడి సంఘం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే మోడీ ప్రభుత్వ లక్ష్యం

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి



**మార్కాపురం పెన్ పవర్ మే19**
ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధి పథకం కింద బ్యాంకు రుణాలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు ఎన్డీఏ ప్రభుత్వం శుభవార్త అందించిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలం చేకూర్చే దిశగా స్త్రీనిధి ద్వారా రుణాల మంజూరుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా చిన్న స్థాయి ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకునే మహిళలు, స్వయం ఉపాధి ఆశించే యువతకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ రుణాలపై కేంద్ర ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ అందించనున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సాధికారత, సూక్ష్మ పరిశ్రమల ప్రోత్సాహం, స్వయం ఉపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

# గిరిజనుల మౌలిక సదుపాయాల కోసం గ్రామసభ



**పుల్లల చెరువు పెన్ పవర్ మే 19**
మండలంలోని యండ్రపల్లి పంచాయతీ గిరిజన చెంచుకాలనీ అంగన్వాడి సెంటర్లో మంగళవారం ఏర్పాటు చేసిన జన్ భగీదార్ గ్రామసభలో ఎంపీడీవో మరియదాసు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నలగాటి ఆత్మానంద నాయుడు మాట్లాడుతూ మండల అభివృధి అధికారి మరియదాసు ఆధ్వర్యంలో శ్రీశైలం ఐటిడిఏ జన్ భగీదార్ ప్రోగ్రామ్ ద్వారా చెంచు కాలినీ గిరిజనుల యొక్క మౌలిక సదుపాయాల కోసం ప్రోగ్రామ్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గిరిజనుల మౌలిక సదుపాయాలకోసం అందించే సేవలు సందేహాలను మరియు కొత్త విషయాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు గిరిజను ల యొక్క ఆధార్ సవరణలు, పునరుద్దరణ లు, బియ్యం కార్డుల సవరణలు అన్నదాత సుఖీభవ పథకంలో తిరస్కరణ కారణాలు, వాటిని మళ్లీ చేర్చటం గురించి సమగ్రంగా వివరించారు. అదేవిధంగా రెవెన్యూ, అటవీ వ్యవసాయ భూమి వారసత్వం విభజన వాటిని వారి కుటుంబ సభ్యులకు సంక్రమించే విధానం, వాటి కావాల్సిన పత్రాలు మరియు విధానం అందులో సందేహాలను, పుట్టిన మరియు చనిపోయిన సర్టిఫికెట్లు ఆలస్యంగా పొందే విధానం, అందుకు కావాల్సిన పత్రాలు, ఒకవేళ తిరస్కరిస్తే చేయవలసిన విధానం గురించి , బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన విషయాలు సంక్షేమ పథకాల విషయంలో లబ్ధిదారులకు నగదు జమ అవడంలో గల సమస్యలను వాటి పరిష్కార విధానాలను గురించి వివరించారు.గిరిజన జనాభా పరంగా గల అనేక సమస్యలను గురించి వివరించారు.. గ్రామ సభలో మొత్తం ఐదు అర్జీలు రావటం జరిగిందని ఇంటి నిర్మాణాల గురించి 3, మరియు వితంతు పింఛన్లు గురించి 2, అర్జీలు రావటం జరిగిందన్నారు. త్వరలోనే పరిష్కరిస్తామనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం వెంకట భాస్కర్, అంగన్వాడీ సూపర్వైజర్ కె వి సుబ్బమ్మ, వైద్యాధికారి శ్రీనాథ్, గ్రామ కార్యదర్శి ఆత్మ నంద నాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి, ఆధార్ సెంటర్ అధికారి, గిరిజన గూడెం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చేవూరు పొలాల్లో నేలబావిలో మృతదేహం లభ్యం



**గుడ్లూరు, పెన్ పవర్, మే 19**
గుడ్లూరు మండలం చేవూరు గ్రామం పొలాల్లో ఉన్న నేలబావిలో పురుషుని శవం ఉండగా అటుగా వెళుతున్న ప్రజలు గుర్తించగా, దానిని విఆర్ఓ మల్లికార్జున బయటకు తీయించారు. అతని దగ్గర ఉన్న ఆధార్ కార్డు మరియు పాన్ కార్డులను పరిశీలించగా, చనిపోయిన అతని పేరు సొన్సాయిగోరే అని, గోరే వయస్సు 27 సంవత్సరాలు కాగా, అతను అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఉన్నాడని తెలిపారు. గోరె మరణ కారణంపై తగు చర్య తీసుకోమని గుడ్లూరు పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడమైనది ఎస్సై వి.వెంకట్రావు తెలిపారు.

# పెంచిన పెట్రోలు,డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి

## -సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్

**కందుకూరు పెన్ పవర్ మే19:**
పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దేశాలు కన్నా, రాష్ట్రాల కన్నా అత్యధికంగా పెట్రోలు, డీజిల్ ధరలు మన రాష్ట్రంలోని అమలవుతుందని అన్నారు.తాజా పెంపుతో రాష్ట్రంలో లీటరు పెట్రోల్ రూ.113.62, లీటర్ డీజిల్ రూ.101.24కు చేరింది. చంద్రబాబు ప్రభుత్వం మరో 'బాదుడే బాదుడు' మొదలుపెట్టింది. సూపర్‌సిక్స్ తరహాలో మరో మోసంతో పచ్చి దగా చేస్తోంది. ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం సందర్భంలో మన దేశానికి ఎటువంటి ఇబ్బందులు లేదని పెట్రోల్ గ్యాస్ డీజిల్ వర్తలేదని చెప్పిన మోడీ ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోగానే ధరలు పెంచడంలో మర్మం ఏమిటని ఆయన అన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో గ్యాస్ కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అధిక




ధరలు తగ్గించి పేద ప్రజలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద్ మోహన్, డిహెచ్పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి నత్తా రామారావు పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వర్ధంతి వేడుకలు

## సీపీఎం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ.





**గుడ్లూరు, పెన్ పవర్, మే 19:**

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లూరు సిపిఎం శాఖ ఆధ్వర్యంలో మద్దిశెట్టి జాలయ్య బంకు దగ్గర, చేవూరు గ్రామంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఐద్వా గుడ్లూరు నాయకులు సుంకర విజయలక్ష్మి, కొట్టే వెంకట ప్రసన్న, ఈ మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తూ, సిపిఎం మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు నాయకులు మద్దిశెట్టి జాలయ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య ఆశయం, ఈ దేశంలో దోపిడీ లేని సమాజాన్ని చూడాలని, ఆయన ఆశయ సాధన కోసం మనందరం కూడా కంకణం కట్టుకోవాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, కులాలను, మతాలను రెచ్చగొడుతూ, ప్రతిపక్షాల ఓట్లు లక్షలాదిగా తీసివేస్తూ పరిపాలన సాగిస్తుందని, బిజెపి విధానాలను వెనక ఎండగొట్టడమే కామ్రేడ్ సుందరయ్యకు ఘనమైన నివాళులు అని అన్నారు. ఈ దేశంలో శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం నడుం బిగించాలని వాళ్ళు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి, కొట్టే వెంకయ్య, సీనియర్ నాయకులు, దామా కృష్ణయ్య, ఎం.వెంకటేశ్వర్లు అంజయ్య, ఖాదర్ బాషా, ఎస్ డి సుభాని, మజ్జిగ దాత పొట్లూరి ప్రసాద్, ఎం.సుభాన్, సిఐటియు నాయకులు, జాషువా, సైమాన్, కొట్టే పుల్లయ్య, సాలిపేట నాయకులు, బి ప్రభు, మస్తాన్ రావు, పొట్లూరి మల్లికార్జున, రామాల శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సర్వేర్ పవన్ కుమార్ దుర్మరణం



**పామూరు, పెన్ పవర్, మే19**

మండల సర్వేర్ బుడంగుంట్ల పవన్ కుమార్ (28) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన మోపాడు బంగ్లా వద్ద జాతీయ రహదారి 565 పై మంగళవారం చోటు చేసుకున్నది. మండలంలో జరుగుతున్న రీ సర్వేలో పాల్గొన్న పవన్ కుమార్ తిరిగి పామూరు వస్తుండగా మోపాడు బంగ్లా రోడ్డు వద్ద జాతీయ రహదారి 565 పై రోడ్డుకు అడ్డంగా గేదె రావడంతో పల్సర్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. 108 వాహనం ద్వారా పామూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్ శ్రీరామచంద్రుని వాసుదేవరావు, వీఆర్వోలు, టిడిపి నాయకులు పామూరు ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్ లు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పవన్ కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సింగరాయకొండ మండలానికి చెందిన పవన్ కుమార్ అవివాహితుడు. ఉద్యోగం రీత్యా పామూరులో విధులు నిర్వహిస్తున్నాడు. ఏఎస్ఐ జిలాని భాష సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కొరకు మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తలచినట్లు ఏఎస్ఐ జిలాని భాష తెలిపారు.

# పొలం వివాదంలో హత్య చేసిన నిందితుడి అరెస్ట్




**పామూరు,పెన్ పవర్ , మే19**

పొలం విషయంలో నెలకొన్న మనస్పర్థల నేపథ్యంలో ఒక వ్యక్తిని హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ సీఎస్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద గోగులపల్లి గ్రామానికి చెందిన మిరియం బాబు, చిలంకూరి రమేష్ రెడ్డి కుటుంబాల మధ్య పొలం వివాదం న్యాయస్థానంలో నడుస్తోంది. ఈ నేపథ్యంలో 15 వ తేదీ రమేష్ రెడ్డి పొలం దగ్గరకు వెళ్లిన విషయాన్ని మిరియం వెంకటేశ్వర్లు కుటుంబం ప్రశ్నించింది. దీంతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదే రోజు మధ్యాహ్నం 3:15 గంటల సమయంలో మిరియం వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా రమేష్ రెడ్డి అడ్డగించాడు. ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరగడంతో రమేష్ రెడ్డి కత్తితో మిరియం వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును పామూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు సిఐ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం నిన్ను తలన అరెస్ట్ చేసి కోర్ట్ల హాజరు పరుస్తున్నట్లు సిఐ వినోద్ కుమార్ తెలిపారు.

# అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు తప్పిన ప్రమాదం



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 19**

ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన సిఎస్పురం లోని బీసీ హాస్టల్ ఎదురుగా జరిగింది. సిఎస్పురం ఒడియ రాజుల నగర్ కు చెందిన కొద్దిమంది కారులో డీజి పేటకు వెళుతుండగా బీసీ హాస్టల్ వద్ద కారు డ్రైవర్ కు గుండెలో కొద్దిగా నొప్పి రావడంతో కారు అదుపుతప్పి రోడ్డుకు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ఆగిపోయింది. ఆ విద్యుత్ స్తంభంకు తీగేలు లేకపోవడం, విద్యుత్ కనెక్షన్ లేక పోవడం తొ ప్రమాదం తప్పింది.


# బాల్య వివాహాలు నిర్మూలించాలి..

## సూపర్ వైజర్ సుబ్బమ్మ...



**పుల్లల చెరువు పెన్ పవర్ మే 19**

పుల్లల చెరువు మండలం ఎంద్రపల్లి ఎస్సీ సెంటర్‌లో సెక్టార్ సూపర్‌వైజర్ కె.వి. సుబ్బమ్మ ఆధ్వర్యంలో కిషోర వికాసం సమావేశం ఘనంగా నిర్వహించారు. బాలికలు తమ భావాలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం, కొత్త విషయాలు నేర్చుకోవడం, తమ అవసరాలను గుర్తించుకోవడం, అలాగే భద్రత, ఆరోగ్యం, విద్యపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ కె.వి. సుబ్బమ్మ మాట్లాడుతూ బాలికలు సమాజంలో ధైర్యంగా ముందుకు రావాలంటే విద్యతో పాటు ఆత్మవిశ్వాసం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రతి బాలిక తన హక్కులను తెలుసుకుని, సమస్యలను నిర్భయంగా వ్యక్తపరచగలగాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వెంకట భాస్కర్ మాట్లాడుతూ బాలికల విద్య కుటుంబ అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ పురోగతికి కూడా ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రభుత్వం బాలికల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.యంద్రపల్లి కార్యదర్శి ఆత్మ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని, రక్తహీనత నివారణ, పోషకాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమన్నారు.బాలికలకు ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు విద్యను మధ్యలో ఆపకుండా ఉన్నత స్థాయికి చేరుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకట సుబ్బయ్య, డిజిటల్ అసిస్టెంట్ భార్గవ్, ఐటిడిఎ బి. ఎలీషా, సచివాలయ సిబ్బంది మల్లు నాయక్, షార్ప్ సంస్థ ప్రతినిధి గురవయ్య పాల్గొన్నారు.




# నిప్పుల కొలిమి లా ఎండలు

## ప్రచండ భానుడి ప్రతాప భగ భగ లు

## సూర్య ప్రతాపం తో మాడు పగులుతోంది

## లబోదిబో మంటున్న ప్రజలు

## 10 గంటలకే బోసిపోతున్న వీధులు

## వ్యాపారాలు లేక చిరువ్యాపారులు లబోదిబో

**గిద్దలూరు పెన్ పవర్ మే 19**

తెలుగు రాష్ట్రాలలో సూర్యుడి ప్రతాపం పెరుగుతోంది. మే నెల మధ్యలోకి ప్రవేశించటంతో భానుడి భగభగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటలు దాటితే బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. సాయంత్రం నాలుగు గంటల వరకూ సూర్యుడు ప్రతాపం చూపుతున్నారు . దీంతో ఉక్కబోత, వేడిగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ బ్యాడ్ న్యూస్ వినిపించింది. మరో ఐదు రోజుల పాటు ఈ పరిస్థితి తప్పదని తెలిపింది. ఆదివారం (మే24) వరకు ఎండ తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అప్రమత్తం చేస్తోంది. మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 44డిగ్రీల - 46డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు , అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42డిగ్రీల - 44డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా మంగళవారం రోజున ఏపీలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 46 డిగ్రీల మధ్యన నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే 47 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 88 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవటం మంచిదని సూచించింది. అలాగే శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని.. తప్పనిసరై తేనే బయటకు వెళ్తే గొడుగు, టోపీ, తలపాగా వంటివి ధరించాలని అప్రమత్తం చేసింది.

# నూతన డీఈఓ ను మర్యాదపూర్వం కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు



**మార్కాపురం పెన్ పవర్ మే19**

జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన సామ సుబ్బారావును ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఆర్. సంజీవ కుమార్, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎన్. ఏలియా, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు మందా బాలరాజు (గ్రేడ్- హెచ్ఎం), మీర్జిపేట ప్రధానోపాధ్యాయులు కే. ప్రవీణ్ కుమార్, దుపాడు గ్రేడ్- హెచ్ఎం కొండేపోగు డానియల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ఏపీటీఎఫ్ సంపూర్ణ సహకారం అందిస్తుందని డీఈఓకు హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా ప్రమాణాల అభివృద్ధి దిశగా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు. అలాగే మార్కాపురం జిల్లాకు నూతనంగా డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన సామ సుబ్బారావుకు ఏపీటీఎఫ్ తరపున హృదయపూర్వక స్వాగతం తెలిపారు.

# పేకాట స్థావరం పై పోలీసుల దాడులు



**పామూరు, పెన్ పవర్, మే19**

మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో జరుగుతున్న పేకాట స్థావరం పై మంగళవారం పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులు ను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.24.500 లు నగదును స్వాధీనం చేసుకొని జప్తు చేసినట్లు ఎస్ఐ కట్టా అనూక్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అనూక్ హెచ్చరించారు.

# ఎక్సైజ్ నూతన సిఐగా మౌలాలి

**కందుకూరు పెన్ పవర్, మే 19**

కందుకూరు ఎక్సైజ్ నూతన సిఐగా మౌలాలి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐలు రేవతి, తేజేశ్వర్ కూడా ఉన్నారు.



# లోకల్ పోరుకు వ్యూహాలు

**విజయవాడ, మే 19, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఏడాది నాటికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జిల్లాల వారీగా సమన్వయ కర్తలు నియమించింది. జిల్లాలకు వెళ్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ అభ్యర్థులకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని జిల్లాలకు కొందరు ముఖ్యనేతలకు బాధ్యతలను అప్పగించారు. ఇక కూటమిలోని మరొక మిత్రపక్షమైన జనసేన పార్టీ కూడా జిల్లాల వారీగా పరిశీలికులను నియమించింది. వారు జిల్లాలకు వెళ్లి పార్టీ నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నివేదికను పవన్ కల్యాణ్ కు అందించనున్నారు. బీజేపీ మాత్రం ఇంకా దీనిపై ఇంకా కసరత్తులు మొదలు పెట్టలేదు. మరొకవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని, అలాగే సామాజిక సమీకరణాలను కూడా ఖచ్చితంగా పాటించాలని వైఎస్ జగన్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో బూత్ లెవెల్ కమిటీలను పూర్తి చేసి వారిని యాక్టివ్ చేయాలని, ఇప్పటి నుంచే స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో లోకల్ హాట్ మొదలయిందనే చెప్పాలి

ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యేలకు సవాల్ గా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఈ రెండేళ్లలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య నియోజకవర్గాల్లో సఖ్యత లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి మూడు పార్టీల అగ్రనాయకత్వం అప్రమత్తమయింది. పై స్థాయిలో మూడు పార్టీల్లోని అగ్ర నాయకత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదవులు, కాంట్రాక్టులు, ఇసుక, మద్యం వంటి విషయాల్లో తేడాలు రావడంతో కూటమి నియోజకవర్గాల్లో కలసి లేదన్నది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరుకు కొలమానం కావడంతో వారిలోనూ ఆందోళన నెలకొంది. ఏ పార్టీ ఎమ్మెల్యే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తుంటే మిగిలిన పార్టీల నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు అధినాయకత్వానికి అందుతున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏదీ మినహాయింపు కాదు. తమ గెలుపునకు దోహదపడిన తమ పార్టీకి సంబంధించిన నాయకులకే పదవులు, కాంట్రాక్టులు ఇస్తుండటంతో మిగిలిన పార్టీల నేతలు, క్యాడర్ లో అసంతృప్తి నెలకొంది. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య సఖ్యత లేదు. అందుకే అక్కడ టీడీపీ ఇన్ ఛార్జి బాధ్యతల నుంచి వర్మను పార్టీ నాయకత్వం తప్పించాల్సి వచ్చింది. ఇలా ఉత్తరాంధ్ర నుంచి తీసుకుంటే కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతల మధ్య ఎంత సమన్వయం కుదిర్చినప్పటికీ ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన మూడు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతుంది. ం

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కడపలో రెండు నియోజకవర్గాలపై దృష్టి

**కడప, మే 19, పెన్ పవర్:** ఏపీ రాజకీయాల్లో వైయస్ షర్మిల దూకుడు పెంచాలని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. ప్రధానంగా గట్టి అభ్యర్థులను బరిలో దించడం ద్వారా ఓట్లతోపాటు సీట్లు పెంచుకోవాలని చూస్తున్నారు. మరోవైపు తాను సైతం ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కడప ఎంపీగా పోటీ చేశారు షర్మిల. త్రిముఖ పోటీలో భాగంగా.. ఆమె ఏకంగా లక్ష యాభై వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. ఒకానొక దశలో కడప ఎంపీగా అవినాష్ రెడ్డి ఓడిపోతారని కూడా అంచనాలు వచ్చాయి. అయితే రాజకీయ ప్రత్యర్థిగా భావించే జగన్మోహన్ రెడ్డి పార్టీని గట్టిగానే దెబ్బతీయగలిగారు షర్మిల. కడప జిల్లాలో కూటమికి ఏడు అసెంబ్లీ స్థానాలు లభించాయి అంటే.. షర్మిల ప్రభావం అధికంగా ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై. వైసిపి ఓడిపోయేందుకు షర్మిల దోహదపడ్డారు. అయితే ఈసారి పార్లమెంట్ స్థానానికి కాకుండా అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు షర్మిల. దానికి కారణం లేకపోలేదు. అసెంబ్లీలో తన వాయిస్ వినిపించడం ద్వారా తన పొలిటికల్ కెరీర్ కు ఒక నిర్మాణం జరుపుకోవాలని చూస్తున్నారు. ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షానికి పరిమితం అయినా.. ఆయన అసెంబ్లీకి రారు. అధికారంలోకి వస్తే అదే జగన్మోహన్ రెడ్డి పై గట్టిగానే తన వాయిస్ వినిపించవచ్చు. ఈ రెండు కారణాలతోనే షర్మిల ఇప్పుడు అసెంబ్లీ వైపు మొగ్గు చూపుతున్నారు. తనకు సేఫ్ గా ఉండే నియోజకవర్గాలను ఎంచుకునే పనిలో ఉన్నారు. రాయలసీమలో అయితే కలిసి వస్తుందన్న అంచనా. అపై కడప జిల్లాలో అయితే సునాయాసంగా విజయం సాధించవచ్చు అనేది ఆమె అభిప్రాయం. అందుకే కడప జిల్లాలో ఆమె అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో ప్రధానంగా రెండు నియోజకవర్గాలపై ఆమె దృష్టి పెట్టారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గం పై ఫోకస్ పెట్టారు. దానికి కారణం లేకపోలేదు. ఆ నియోజకవర్గం తన తల్లి విజయమ్మ పుట్టినిల్లు. తన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి అక్కడ ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ నియోజకవర్గ అయితే సేఫ్ జోన్ గా ఉంటుందని భావిస్తున్నట్లు సమాచారం. కడప నియోజకవర్గం పై కూడా ఆమె దృష్టి పెట్టారట. జిల్లా కేంద్రం కావడంతో అక్కడ నుంచి రాజకీయాలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వస్తున్నారట. పైగా కడప అసెంబ్లీ నియోజకవర్గంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ అభిమానులు ఎక్కువ. మరి షర్మిల ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి.

## చంద్రబాబు.. లోకేష్... దేవాన్ష్

**విజయవాడ, మే 19, పెన్ పవర్:** చంద్రబాబు కుటుంబంలో ఏది జరిగిన ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణే. ఇప్పటివరకు చంద్రబాబు.. తరువాత లోకేష్.. ఇప్పుడు దేవాన్ష్ అన్నట్టు పరిస్థితి మారింది. చదువుతో పాటు ఇతరత్రా అంశాల్లో సైతం ముందున్నారు దేవాన్ష్. మొన్నటి వరకు చదరంగంలో సైతం సత్తా చాటారు. ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని నైపుణ్యం కనబరిచారు. ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు దేవాన్ష్, ఓ యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. పురాతన జంతువులతో పాటు అంశాలను తనదైన శైలిలో వివరించేందుకు సిద్ధపడ్డారు. యూట్యూబ్ ఛానల్ పరిచయ కార్యక్రమంలో భాగంగా కుమారుడు దేవాన్ష్‌తో పాటు లోకేష్ పాలుపంచుకున్నారు. ప్రోమో వీడియోలో లోకేష్ సైతం కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నారాతోపాటు నందమూరి కుటుంబానికి సైతం దేవాన్ష్ స్పెషల్. నందమూరి బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణిని లోకేష్ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాలకు పెద్ద మనవడు దేవాన్ష్, బాలకృష్ణకు ఏకైక కుమారుడు లోకేష్ కావడంతో.. దేవాన్ష్ సైతం ఏకైక కుమారుడు లోకేష్ దంపతులకు. అయితే చిన్ననాటి నుంచి నానమ్మ భువనేశ్వరి పర్యవేక్షణలోనే పెరుగుతున్నాడు. ఏటా సంక్రాంతి వేడుకల సమయంలో నారావారిపల్లిలో సైతం దేవాన్ష్ సందడి చేస్తుంటాడు. గ్రామానికి వెళ్ళిన క్రమంలో తోటి చిన్నారులతో ఆటలాడుతుంటాడు. కర్ర సాములో సైతం ప్రావీణ్యం పొందాడు. ముఖ్యంగా చెస్ లో రాణిస్తూ వచ్చాడు. ప్రపంచ స్థాయి పోటీల్లో సైతం పాల్గొంటూ వచ్చాడు. ఇప్పుడు కేవలం పరిశోధనాత్మకమైన, ప్రాచీనమైన డైనోసార్లు, ఇతరత్రా జంతువుల గురించి తనకు తెలిసిన విషయాన్ని పంచుకునేందుకు డినోడిట్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్లో అందుబాటులోకి వస్తున్నాడు. కచ్చితంగా ఒక ముఖ్యమంత్రి మనవడు, ఒక మంత్రి కుమారుడు, ప్రముఖ హీరో మనవడు, సెలబ్రిటీ హోదాలో ఇప్పుడు దేవాన్ష్ యూట్యూబ్ ద్వారా పరిచయం అవుతుండడం మాత్రం గొప్ప విషయం. ఎందుకంటే ఆయన ఎంచుకునేందుకు సినిమా రంగంతో పాటు రాజకీయరంగం ఎలానూ ఉంది. ఒక పద్ధతి ప్రకారం దేవాన్ష్ విషయంలో అడుగులు వేస్తోంది నారా కుటుంబం. ఈ ప్రత్యేక యూట్యూబ్ ఛానల్స్ కు లక్షల్లో అప్పుడే వ్యూయర్ షిప్ వస్తోంది. మున్ముందు కచ్చితంగా ఇది సంచలనాలకు వేదిక కానుంది. ఎక్కువమంది నారా దేవాన్ష్ కు శుభాకాంక్షలు చెబుతున్నారు. దేవాన్ష్ ఒక యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించాడు. రాక్షస బల్లులు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించి కొంతకాలంగా దేవాన్ష్ పరిశోధన చేస్తున్నాడు. వివిధ పుస్తకాలలో ప్రచురితమైన అంశాలను క్రోడీకరించి.. తాను తెలుసుకున్న విషయాలను.. ఆశ్చర్యానికి గురిచేసే అంశాలను.. ఆకట్టుకునే విధంగా రూపొందించాడు. ఈకాలపు పిల్లలకు అర్థమయ్యే విధంగా వాటిని రూపొందించాడు. వీటిని పాడ్ కాస్ట్ రూపంలో తన యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేయబోతున్నాడు. సాధారణ యూట్యూబ్ ఛానల్ మాదిరిగా కాకుండా.. దానికోసం ఒక డైనోసార్ ప్రపంచాన్ని సృష్టించాడు దేవాన్ష్. ప్రాచీన ప్రపంచంలోకి ప్రేక్షకుడి లాగా తన తండ్రిని ఆహ్వానించాడు. దీనిపై అనేక ప్రశ్నలు నారా లోకేష్ అడిగితే.. దేవాన్ష్ ఏ మాత్రం తడుముకోకుండా సమాధానం చెప్పాడు. ఇదే విషయాన్ని నారా లోకేష్ సోషల్ మీడియాలో ప్రస్తావించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. నారా దేవాన్ష్ కొంతకాలంగా శిలాజాలు.. పురాతన సంఘటనలు.. వందల సంవత్సరాల క్రితం జీవించిన జంతువులు.. వంటి వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాను తెలుసుకున్న విషయాలను.. పాడ్ కాస్ట్ రూపంలో చెప్పడానికి నారా దేవాన్ష్ ప్రయత్నిస్తున్నారు. నారా లోకేష్ ప్రోమో వీడియో రిలీజ్ చేయడంతో.. నారా దేవాన్ష్ యూట్యూబ్ ఛానల్ మీద అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

## కమలంపై పసుపు గుర్రు

**విశాఖపట్టణం మే 19, పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తోంది తెలుగుదేశం. కేంద్ర ప్రభుత్వంలో సైతం కీలక భాగస్వామి. అందుకే రాష్ట్ర ప్రయోజనాల తో పాటు రాజకీయ ప్రయోజనాల విషయంలో రాష్ట్రానికి పెద్ద పీట వేస్తోంది కేంద్రం. అయితే అదే స్థాయిలో ఏపీ నుంచి బిజెపి ప్రాతినిధ్యం కోరడం తెలుగుదేశం పార్టీకి లోటు. తాజాగా రాజ్యసభ పదవులకు సంబంధించిన ఎంపిక విషయంలో బిజెపి పట్టుబడుతుండడంతో టిడిపి సీనియర్లు మదన పడుతున్నారు. మరోసారి ఏపీ నుంచి రాజ్యసభ పదవి కోరుతోంది బిజెపి. కానీ ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఎన్ని రోజులపాటు పార్టీ కోసం కష్టపడితే.. తమకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని.. తమకు వచ్చే అవకాశాలను బిజెపి తన్నుకుపోతోందని ఆవేదనతో ఉన్నారు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. టిడిపి సీనియర్లు చాలామంది పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో సీట్లు త్యాగం చేసిన వారు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారు. అయితే ఈ రెండేళ్ల కాలంలో రెండుసార్లు రాజ్యసభ, అదే స్థాయిలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ జరిగింది. ఆ సమయంలో బిజెపి ఎంట్రీ ఇస్తోంది. పదవులను తీసుకుంటోంది. రెండుసార్లు రాజ్యసభ పదవి అలానే తీసుకుంది. ఎమ్మెల్సీ పదవులను సైతం కూటమి ఖాతాలో పొందింది. ఇప్పుడు మరోసారి రాజ్యసభ పదవి కోరుతుండడంపై టిడిపి సీనియర్లలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఒకసారి బిజెపితో చెడి చాలా రకాలు ఇబ్బందులు పడ్డారు చంద్రబాబు. అందుకే కేంద్ర పెద్దలతో సఖ్యత గా గడుపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ పదవులన్నీ టిడిపి కూటమికి దక్కనున్నాయి. అయితే ఇప్పుడు ఆ నాలుగింటిలో ఒక పదవిని కోరుతోంది బిజెపి. జనసేనకు ఒకటి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ పార్టీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. అందుకే కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బిజెపితో పాటు జనసేనకు రెండు పోతే టిడిపికి మిగిలేది కేవలం రెండు మాత్రమే. ఆ రెండింటిలో పదవీ విరమణ చేస్తున్న సానా సతీష్ కు కొనసాగింపు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక మిగిలింది ఒకటే. దానికోసం చాలామంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. బిజెపి పోటీలో లేకపోతే.. టిడిపి కి మూడు, జనసేనకు ఒకటి తేలిపోయేది. అలా కాకుండా బిజెపి సైతం ఒక పదవి కోరుతుండడం పై టీడీపీ సీనియర్లు ఆగ్రహంగా ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సర్దుబాటు చేసుకోవాల్సిందని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ ఇన్ని రోజులు పార్టీ కోసం పనిచేసిన తమ పరిస్థితి ఏంటి అని టిడిపి సీనియర్లు మదనపడుతున్నారు.

# మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌లా వ్యవహరిస్తా

"చేపలు పట్టడమే కాదు, వాటిని అమ్ముకోవడంలోనూ మత్స్యకారులకు అండగా ఉంటాను. మీ ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా, ప్రపంచవ్యాప్తంగా గిరాకీ సృష్టించేలా ఒక మార్కెటింగ్ మేనేజర్‌లా నేను వ్యవహరిస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. చేపలు మంచి పౌష్టికాహారమని, ప్రోటీన్లు అధికంగా ఉండే ఈ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని మన మత్స్యకారులకు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం వేటకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతతో, కొత్త ఆదాయ మార్గాలతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు.

నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం, తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, చేపల వేట నిషేధ కాలానికి గాను 1,30,796 మత్స్యకార కుటుంబాలకు, ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి జమ చేశారు. సీఎం ప్రసంగిస్తుండగానే లబ్ధిదారుల ఫోన్లకు డబ్బులు జమ అయినట్లు సందేశాలు రావడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

### మత్స్యకారుల హక్కులు, వనరులపై పూర్తి అధికారం

"ఈ తీరం మనది, ఈ బోటు మనదే, ఇక్కడి సంపద కూడా మనదే. ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు," అని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా చెప్పారు. మన సముద్ర జలాల్లోకి పొరుగు రాష్ట్రాల బోట్లు వస్తే సహించేది లేదని, తీరప్రాంతంలో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులను కాపాడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండుగా ఉన్నాయని, ఆ నీటి వనరుల్లో చేపల పెంపకం చేసుకునే హక్కును మత్స్యకారులకే కట్టబెట్టామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ సీడ్ అందించాలని మత్స్యశాఖను ఆదేశించినట్లు వెల్లడించారు. మత్స్యకారుల వేటను సులభతరం చేసేందుకు, 60 శాతం సబ్సిడీతో 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

### మహిళల ఆర్థిక స్వావలంబనకు సీవీడ్ సాగు

మత్స్యకార పురుషులతో పాటు, మహిళల ఆర్థిక సాధికారతకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మత్స్యకార, డ్వాక్రా సంఘాల మహిళలకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో 'సీవీడ్' (సముద్రపు నాచు) సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దీని ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతామని ఆయన హామీ ఇచ్చారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సీవీడ్, తీరప్రాంత నిఘా కేంద్రం స్టాళ్లను ఆయన సందర్శించి, అధికారుల పనితీరును అభినందించారు.

### అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన

తీరప్రాంత అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వాములను చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నామని, దీని ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని 25 మత్స్యకార గ్రామాలను కలుపుతూ మెటల్ రోడ్లు నిర్మిస్తామని, నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీతకు రూ. 6.19 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటుతో స్థానికులకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

### విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, మత్స్య రంగం కూడా తీవ్రంగా దెబ్బతిందని చంద్రబాబు

ఆరోపించారు. "గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి కుట్రల వరకు వారిది విధ్వంసమే. ఆ విధ్వంసాన్ని సరిదిద్దడానికి మాకు 23 నెలలు పట్టింది. ఇప్పుడు రాష్ట్రం బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది" అని అన్నారు. రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామని, రాయలసీమలో డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు, తిరుపతి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్ వస్తున్నాయని వివరించారు.

### బీసీల సంక్షేమమే టీడీపీ డీఎన్ఏ

టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారని, వారికి దశాబ్దాల అనుబంధం ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి రుణం తీర్చుకుంటామని చెప్పారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు, వడ్డెర్లకు, గీత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి జీవన ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' మంగళవారం అధికారికంగా ధృవీకరించింది.

భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్-రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్-రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం

- మొదటి పేజి తరువాయి

దరఖాస్తు చేసుకున్న 785 ప్రైవేట్ ఆసుపత్రులకు ఈ నిధులు అందాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రులకు మొత్తం రూ. 5,556 కోట్లను చెల్లించామని, బకాయిల చెల్లింపుల హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పునరుద్ఘాటించారు. దీనికి సంబంధించిన నివేదికను ట్రస్టు సీఈఓ చక్రధరబాబు మంత్రికి అందజేశారు.

## మోదీ తీరుపై నార్వే జర్నలిస్టు అసంతృప్తి...

### ఘాటుగా సమాధానం ఇచ్చిన విదేశాంగ శాఖ అధికారి

ప్రధాని నరేంద్ర మోదీ నార్వే పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛపై ప్రశ్నలు లేవనెత్తిన ఓ నార్వేజియన్ జర్నలిస్టుకు, భారత విదేశాంగ శాఖ అధికారి ఘాటుగా సమాధానమిచ్చారు. 'ఏమైనా సమస్యలుంటే కోర్టుకు వెళ్లండి' అంటూ ఆయన ఇచ్చిన జవాబు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఐరోపా పర్యటనలో భాగంగా ఓస్లోలో ప్రధాని మోదీ, నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్వే ప్రధాని ప్రశ్నలకు సమాధానమిచ్చినా, మోదీ మాత్రం ప్రశ్నలను పట్టించుకోకుండా వెళ్లిపోయారు. దీనిపై నార్వేజియన్ జర్నలిస్ట్ హెల్లె లింగ్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తన ప్రశ్నను స్వీకరించలేదని ఆమె ఆరోపించారరు. అనంతరం భారత విదేశాంగ శాఖ నిర్వహించిన మీడియా సమావేశంలో అదే జర్నలిస్ట్ పాల్గొన్నారు. భారత ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛ వంటి అంశాలపై ఆమె ప్రశ్నలు సంధించారు. దీంతో ఆమెకు, విదేశాంగ శాఖ కార్యదర్శి (వెస్ట్) సిబి జార్జ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సిబి జార్జ్ తన సమాధానంలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బలంగా సమర్థించారు. భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని, న్యాయం కోసం ఆర్టికల్ 32, 226 కింద కోర్టులకు వెళ్లే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. కొంతమంది విదేశీ విమర్శకులు "అజ్ఞాన ఎన్జీవోలు" ఇచ్చే నివేదికలపై ఆధారపడి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఏవైనా సమస్యలుంటే కోర్టును ఆశ్రయించాలని ఆమెకు సూచించారు.

జర్నలిస్ట్ పదేపదే అడ్డుతగలడంతో సిబి జార్జ్ కాస్త అసహనానికి గురయ్యారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, భారత దౌత్యాధికారి ఇచ్చిన బలమైన సమాధానంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు

వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి నాడు ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

# ఉపాధిహామీలో ప్రజలకు మేలుచేసే పనులు చేపట్టాలి

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -రహదారిలో వెళుతూ ఉపాధికూలీలతో ముచ్చటించిన ఎమ్మెల్యే





**గుడ్లూరు, పెన్ పవర్, మే 19:**

ఉపాధిహామీ పనుల ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులను చేయించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం గుడ్లూరు, తెట్టు రహదారిలో అటుగా వెళుతూ కారు ఆపి తెట్టు వద్ద కాలువలో పూడిక తీస్తున్న ఉపాధిహామీ కూలీలతో కొంత సమయం ముచ్చటించి, వారి సమస్యలను తెలుసుకొని, ఉపాధిహామీ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గుడ్లూరు మండలం పోట్లూరు – తెట్టు గ్రామాల మధ్య ఈరోజు ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఏమ్మా.. ఎలా ఉన్నారు. పనులు ఎట్లా ఉన్నాయి. రోజుకు కూలీ ఎంత వస్తోంది.. అంటూ సడన్ గా ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యక్షమై వివరాలు అడుగుతుండడంతో, అక్కడి వారంతా ఆశ్చర్యపోయారు. అనంతరం వారు ఎమ్మెల్యే తో కొంత సమయం మాట్లాడి వారి సమస్యలు తెలుపుకొని, ఈ వేసవిలో ఉపాధిహామీ ఉపయోగపడుతుందని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. వ్యవసాయ పనులు లేని సమయంలో, తమకు ఉపాధిహామీ పథకం ఎంతో ఉపయోగంగా ఉందని మహిళలు ఎమ్మెల్యే గారితో అన్నారు. తదనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగే పనులు చేపట్టాలని, ఎండల తీవ్రత దృష్ట్యా, కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దిగువ మెట్ట, పెద్దచేరువులో గ్రామ సభలు

## ఎంపిడిఓ సీతారామయ్య







**గిద్దలూరు పెన్ పవర్ మే 19**

జన్ భాగిదారి – సబ్ సే దూర్, సబ్ సే పహేల్ కార్యక్రమంలో లో భాగంగా షెడ్యూల్ ట్రైబల్ ఏరియా లయిన దిగువ మెట్ట , చెంచు గూడెం , పెద్దచెరువు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు, సమావేశంలో ప్రతి నిత్యం మెడికల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబడునని,ఈ నెల 21 నుండి 23.వరకుప్రజా సమస్యల పై అర్జీలు స్వీకరిస్తామని, పరిష్కరించ గల అర్జీ లను వెంటనే పరిష్కారం చూపబడదునని ఎంపీడీవో , మండల నోడల్ అధికారి కె సీతా రామారావు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఏఈ పీ ఆర్ ఎస్ సుబ్బారావు, ఏఈ హౌసింగ్ మహేశ్వర రెడ్డి, ఏ పి ఎమ్ వెలుగు మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్సిడీ వ్యవసాయ యంత్రాల దరఖాస్తు గడువు పొడిగింపు

## మండల వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ

**పెద్దారవీడు పెన్ పవర్ మే 19**

వ్యవసాయ శాఖ ద్వారా అర్హులైన రైతులకు సబ్సిడీపై అందజేసే వ్యవసాయ పనిముట్ల దరఖాస్తు గడువును ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎన్. లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు భారీగా సబ్సిడీ పరికరాలను అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అర్హులైన చిన్న, సన్నకారు రైతులు, మహిళా రైతులు, అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు నిబంధనల ప్రకారం 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీపై వివిధ రకాల వ్యవసాయ పనిముట్లను అందజేయనున్నట్లు తెలిపారు.

# అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**కొనకనమిట్ల పెన్ పవర్ మే 19**

రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి కూటమి ప్రభుత్వం హయాంలోనే జరిగిందని ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు.మండల పరిధిలోని బురదపాలెం,ఎదురాళ్లపాడు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.కొనకనమిట్ల మండలానికి రూ.3,000 కోట్ల వ్యయంతో రిలయన్స్ ప్రాజెక్టును తీసుకువచ్చామని దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.పారిశ్రామిక అభివృద్ధితో యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గత వైసీపీ ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసిందని విమర్శించిన ఆయన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి ఇంకా రూ.2,000 కోట్ల నిధులు అవసరమని చెప్పారు.వచ్చే ఐదు నుంచి ఆరు నెలల్లో పనులను పూర్తిచేసి వెలుగొండ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం కూటమి ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గతంలో ఒంగోలుకు వెళ్లేందుకు ప్రజలు సమయం,ధనం ఎక్కువగా ఖర్చు



చేయాల్సి వచ్చేదని ఇప్పుడు జిల్లా ఏర్పాటు వల్ల ప్రజలకు పరిపాలన సౌకర్యాలు మరింత చేరువయ్యాయని అన్నారు.జిల్లా ఏర్పాటుతో మార్కాపురం పరిసర ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగి రైతులు ఆర్థికంగా లాభపడుతున్నారని తెలిపారు.ఈ ప్రాంతాన్ని త్వరలోనే హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు,మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నారాయణస్వామి ఆలయానికి 2 లక్షల నిధులు మంజూరు

## ఉత్తర్వులు కాపీని అందజేసిన ఎమ్మెల్యే ఉగ్ర




**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 19**

మండలంలోని మిట్టపాలెంలో వేంచేసియున్న నారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి లో భాగంగా మహాప్రాకార నిర్మాణం కోసం సీజీఎఫ్ నిధుల కింద రూ.2 లక్షల మంజూరు ఉత్తర్వుల ప్రతిని కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబుకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు కు సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టుటకు మహాప్రాకార నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఈఓ గిరిరాజు నరసింహబాబుకు సూచించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కి మరియు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి దేవస్థానం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై సైబర్ క్రైం పోలీసుల ఉక్కుపాదం

## ముగ్గుర్ని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసుల



**విశాఖపట్నం, పెన్ పవర్ మే 19**

విశాఖ నగరంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేస్తున్న ముగ్గురు బుకీలను సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో అనకాపల్లికి చెందిన లగుడు రవికుమార్ (50), పెందుర్తి మండలం జంగాలపాలెంకు చెందిన గోరపల్లి శివ అప్పారావు (48), కంచరపాలెం జోగారావునగర్‌కు చెందిన జోగి శ్రీనివాస్ (32)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. "క్రికెట్ గురు", "లైన్ గురు", "క్రిక్‌బెజ్", "ఎస్‌విన్ ఎక్స్ఛేంజ్" వంటి యాప్స్, వెబ్‌సైట్ల ద్వారా వాట్సాప్ లింకులు పంపి యువతను బెట్టింగ్ వైపు ఆకర్షిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి సెల్‌ఫోన్లు, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. సాంకేతిక ఆధారాలతో ముఠాను ఛేదించిన సైబర్ క్రైం పోలీసుల పనితీరును అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు భవానీ ప్రసాద్, బీఎండీ ప్రసాద్ ప్రజలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# వైసీపీ హయాంలో ఎస్సీల పై జరిగిన దౌర్జన్యాలను ఖండించిన తెలుగుదేశం పార్టీ నాయకులు




**గిద్దలూరు పెన్ పవర్ మే 19**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాను సారం తెలుగుదేశం పార్టీ నాయకులు గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు , అక్రమాలు దౌర్జన్యాలు , హత్యలపై తీవ్రంగా ఖండించారు ముఖ్యంగా వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు తన దగ్గర డ్రైవర్ గా పనిచేస్తున్న దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం అత్యంత దారుణంగా హత్యకు గురిచేసి మృతదేహాన్ని తీసుకొని వెళ్లి వాళ్ళ ఇంటిదగ్గర పడేసినాడు అంతేకాకుండా ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ బాబుని కోవిడ్ సమయంలో పి పి ఈ కిట్ల కొరత ఉందని బాధితులు, ఆసుపత్రి సిబ్బంది అనారోగ్య సమస్యతో బాధపడుతున్నామని ప్రభుత్వాన్ని అడిగినందుకు తనను వైద్య వృత్తి నుండి సస్పెండ్ చేసి బహిరంగంగా వేధింపులకు గురి చేశారు అనంతరం తనని అరెస్టు చేసి పిచ్చివాడిగా ముద్రించి అవమానించి మానసికంగా చనిపోయేలా ఆయన ఒక సజీవ సాక్ష్యంగా ఒక ప్రత్యేకగా మిగిలిపోయారు ఈ ఘటనాలన్నీ చూస్తే ముఖ్యంగా ఎస్సీ వ్యక్తులు వృత్తిపరమైన నిపుణులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై వైసీపీ హయాంలో నిరంతరం బెదిరింపులు , దౌర్జన్యాలు హింసలు వ్యవస్థాగత అన్యాయాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయని వైసిపి పాలనలో ఎస్సీ వర్గాలపై జరిగిన దౌర్జన్యాలు అణిచివేత ఉదాహరణలుగా వీధి సుబ్రహ్మణ్యం , డాక్టర్ సుధాకర్ , హత్యలు ముఖ్యంగా చెప్పుకోవచ్చు అని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య , కౌన్సిలర్ లు లొక్కు రమేష్ , గుర్రం దానియేలు , పశీదిటి రజిని బాబు,బిల్లారమేష్,కొండయ్య, దేవిడ్, మాజీ సర్పంచ్ కడియం శేషగిరి, ఎలిశెట్టి వెంకటప్ప, గిద్దలూరు మద్దిలేటి, తదితరులు పాల్గొని నిరసనలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ చేరికల సభలో పాల్గొన్న కైపు

## దాదాపు 600 మంది కాంగ్రెస్లో చేరిక

**దర్శి మే 19 పెన్ పవర్**

విజయవాడ ఏ వన్ కన్వెన్షన్ హాల్లో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి సారథ్యంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ లో చేరికల సభలో ఉద్దండ నాయకులతో కలిసి వేదికను పంచుకున్న కేకేసి రాష్ట్ర అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన వివిధ పార్టీల నాయకులు షర్మిలమ్మ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సభలో సిడబ్ల్యుసి సభ్యులు రాష్ట్ర మాజీ మంత్రివర్యులు నీలకంఠ రఘువీరారెడ్డి, సి డబ్ల్యూ సి సభ్యులు పూర్వ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్దరాజు, కేంద్ర మాజీ మంత్రివర్యులు పల్లం రాజు, జెడి శీలం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, ఏఐసీసీ కార్యదర్శులు గణేష్ యాదవ్, పాలకవర్మ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# కిషోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ

**దొనకొండ మే 19 పెన్ పవర్**

మండలంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని ఆధ్వర్యంలో దొనకొండ మండలం కొచ్చర్లకోట సెక్టర్ మంగినపూడి సచివాలయం నందు కిషోరి వికాసం ప్రోగ్రాం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా న్యాయ మరియు పరివేక్షణ అధికారి బి రత్న ప్రసాద్ మరియు ఎంఈఓ సాంబశివరావు కౌమార బాల బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు ప్రతి బాలుడు మరియు బాలిక రక్షణ పొందే హక్కు అభివృద్ధి చెందే హక్కు మరియు భాగస్వామ్య హక్కు మన రాజ్యాంగం వారికి కల్పించింది 18 సంవత్సరాల బాలబాలికలకు ఎవరైనా అసభ్యకరంగా తాకడం వేధించడం శిక్షార్హమైన నేరం అమ్మాయిలకు 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్య నేరం. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య ఆగిపోవడంతో పాటు వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. 14 సంవత్సరాల లోపు బాల



బాలికల తో ప్రమాదకర పనులు చేయించకూడదు. 6 నుంచి 14 సంవత్సరాల బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలి. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. ప్రతి బాలుడు మరియు బాలిక చట్టాలు మరియు హక్కులపై అవగాహన కలిగి ఉండడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చు. చట్టాలపై అవగాహన ద్వారా సురక్షితమైన సమాజం నిర్మితం అవుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ మరియు పర్యవేక్షణ అధికారి రత్న ప్రసాద్, ఎంఈఓ సాంబశివరావు రాజయ్య, హెచ్ఎం నాగార్జున, ఏఎన్ఎం మరియమ్మ మరియు స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, బాలల గ్రామ స్థాయి రక్షణ కమిటీ సభ్యులు మరియు ఏ డబ్ల్యు డబ్ల్యు ఓబులమ్మ కేజియా సుబ్బమ్మ జ్యోతి మల్లేశ్వరి ప్రమీల ఆశాలు కిషోరి బాలికలు పాల్గొనడం జరిగినది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com